http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 24 డిసెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## చైనా, పాక్‌ల నుంచి ముప్పు.. భారత్ సిద్ధంగా ఉండాలి

- ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయి
- మన ఇద్దరు ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారు
- ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి
- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్



## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

- అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
- శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- రేపు ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్

# మత్తులో యువతరం

- కుటుంబాలను రోడ్డున పడేస్తున్న గంజాయి
- 'మత్తు'లో జోగుతున్న యువత
- బాధితుల్లో 20 నుంచి 25 మధ్య గల వయసు వారే ఎక్కువ
- చాక్లెట్ల పేరుతో జరుగుతున్న విక్రయం
- పిల్లలకు ఇలాంటి విషయాలపై అవగాహన లేకపోవడమే కారణం
- దాందాకు చెక్ పెట్టేందుకు సరికొత్త ఏఐ టూల్స్



హైదరాబాద్

ఈ తరం యువత చాలా త్వరగా చెడు అలవాట్లకు బానిసవుతోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించకపోవడమే ఇందుకు కారణం. క్షేత్రస్థాయిలో సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో దీని ప్రభావం వారి కుటుంబాలపై పడుతోంది. ముఖ్యంగా 20 నుంచి 25 మధ్య ఉన్న వయసు వారు గంజాయి తరలిస్తూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. దీన్ని పీలుస్తూ, విక్రయిస్తూ ఆ మత్తులో తూగుతున్నారు. నిత్యావసర సరకులు, ఇతర వస్తువుల పేరుతో దందా సాగిస్తున్నారు. ఒక్క ఏడాదిలోనే 85 కిలోల ఎండు గంజాయి : ఇటీవల ఒక్క పరిగి ప్రాంతంలోనే మూడు కేసులు నమోదయ్యాయి. ఐదుగురి నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఈ ఒక్క ఏడాదిలోనే 85 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. అందులో 23 మందిపై - మిగతా3లో



## సీఎం చిట్‌చాట్‌ల పేరుతో దాక్కోవద్దు

- ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో రేవంత్ బిజీగా ఉన్నారు
- ప్రజలకు ఉపయోగపడే పనులు రేవంత్ చేయడం లేదన్న కేటీఆర్
- మీడియాకు లీకులిస్తూ ప్రజలు దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శ
- సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపాటు

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. నల్గొండ జిల్లాలో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి - మిగతా3లో

## ఇండోపాక్ న్యూక్లియర్ వార్ ఆపాను

- లక్షల సంఖ్యలో ప్రజల జీవితాలను కాపాడారు
- మీకు తెలుసు కదా 8 విమానాలను కూల్చేశారు
- ఆ యుద్ధం మళ్లీ ఉగ్రంగా మారే సమయంలో, ప్రెసిడెంట్ ట్రంప్ కోటి మంది ప్రాణాలను కాపాడారు
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



# ఉద్యోగుల సమస్యలపై స్పెషల్ ఫోకస్


- సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు
- ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని నిర్ణయం
- జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలి
- గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయి



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హెచ్‌వోడీలు వెరిఫై చేయాలని సూచించారు - మిగతా3లో

# తగ్గుతున్న నిఘా పెరుగుతున్న కేసులు



- పాత నేరస్థులపై పోలీస్ శాఖ నిర్లక్ష్యం
- జైల్ల నుంచి విడుదలయ్యాక నిఘా కరవు
- 'సర్వే సమాచారం' నిష్ప్రయోజనంగా మారిందనే విమర్శలు
- నేరస్థులను గుర్తించేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించని పోలీస్ శాఖ

హైదరాబాద్

రాష్ట్రంలో పాత నేరస్థులు మళ్లీ కేసుల్లో ఇరుక్కుంటున్న కేసులు ఎక్కువైపోతున్నాయి. ఈ క్రమంలో పాత నేరస్థుల మనస్తత్వం తెలిసిన పోలీసులు చెప్పిన మాటలివి. 'తెలిసో తెలియకో చేసిన నేరంలో ఒకసారి జైలుకు వెళ్లి వచ్చినప్పుడే నేరస్థుడిలో మార్పు అనేది కనిపించాలి. కానీ రెండోసారి కూడా నేరానికి పాల్పడి కటకటాల పాలైతే మాత్రం అతడు అంత సులువుగా మారేందుకు అవకాశం ఉండదు.' అందుకే పాత నేరస్థులపై తరచూ నిఘా ఉంచాలని సీనియర్ పోలీసులు చెబుతూ ఉంటారు. ఇందుకు జైళ్ల నుంచి విడుదలైన వారి కదలికలపై ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసులు ఓ కన్నేయాల్సి ఉంటుంది. అయితే గతంలో జైళ్ల నుంచి విడుదలయ్యే నేరస్థులపై నిఘా ఉంచేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించే ఆనవాయితీ అంటూ ఉండేది. కానీ, తాజా పరిణామాలు చూస్తుంటే పాత నేరస్థుల విషయంలో పోలీసు శాఖ నిర్లక్ష్యం వహిస్తోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి 2018 జనవరిలోనే తెలంగాణ వ్యాప్తంగా పాత నేరస్థులను నియంత్రించే విషయంలో పోలీస్‌శాఖ ఓ ప్రణాళికను రూపొందించింది. పోలీసుశాఖ సకల నేరస్థుల సమగ్ర సర్వే పేరిట కీలక సమాచారాన్ని సేకరించింది. అప్పట్లో హైదరాబాద్‌లో - మిగతా3లో

## ఆశ్చర్యపరిచే నిర్ణయాలు!

- యువ నాయకత్వంపై మోదీ సర్కారు ఫోకస్
- బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడంతో కమలనాథులు ఫుల్ జోష్‌లో ఉన్నారు
- పశ్చిమ బెంగాల్ ఎన్నిల్లోనూ ఇదే జోరు చూపించాలన్న పట్టుదలతో ఉన్నారు
- కేంద్ర కేబినెట్‌లో యువ నేతలకు మరిన్ని కొలువులు కట్టబెట్టడానికి కసరత్తు
- మోదీ 3.ఓ కేబినెట్‌లో యువతరానికి త్వరలో తగిన ప్రాధాన్యం దక్కబోతోంది



# అంత ఎక్కువా.. నిగ్గు తేల్చాల్సిందే!

అసలు కంటే కొసరు మక్కువ అనేది నానుడి. ఒడిశా అటవీశాఖ అధికారులు చేసిన ఓ పని ఇలాగే ఉంది. అసలు కంటే కొసరు కోసం ఎక్కువ ఖర్చు చేసి వివాదంలో చిక్కుకున్నారు. డిపార్ట్‌మెంట్ అవసరాల కోసం 51 కార్లు కొన్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే కార్లు కొన్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఈ కార్లకు అదనపు హంగుల కోసం వెచ్చించిన ధర దాదాపు వాహనాల రేటుకు దగ్గర ఉండడంతో వివాదం రాజుకుంది. అటవీశాఖ అధికారుల కొను గోల్‌మాల్ బయటపడడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అటవీ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహీంద్రా కంపెనీకి చెందిన 51 థార్ ఎస్‌యూవీలను కొనుగోలు చేసింది. ఒక్కో కారుకు రూ.14 లక్షలు చొప్పున 7 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసింది. తమ విభాగం అవసరాలకు అనుగుణంగా ఈ కార్లలో మార్పులు చేయడానికి అదనంగా రూ. 5 కోట్లు ఖర్చు చేయడంతో సమస్య మొదలైంది. మొత్తం 51 వాహనాలకు అదనపు హంగులతో కలిపి రూ. 12.35 కోట్లు వ్యయం అయినట్టు అధికార పత్రాలు ధ్రువీకరించాయి. దీంతో తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

**నిగ్గు తేల్చాల్సిందే..**

బీజేడీ ఎమ్మెల్యే అరుణ్ కుమార్ సాహూ గత మార్చి నెలలో ఈ అంశాన్ని శాసనసభ సమావేశాల్లో లేవనెత్తారు. అటవీశాఖ కొనుగోలు చేసిన వాహనాలకు అయిన ఖర్చు వివరాలు



ఇవ్వాలని కోరడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కార్లు కొనడానికి 7 కోట్ల రూపాయలు ఖర్చయితే, అదనపు హంగులకు ఏకంగా రూ. 5 కోట్లు వెచ్చించినట్టు తాజాగా వెల్లడైంది. దీంతో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా స్పందించారు. ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, నిగ్గు తేల్చాలని అకౌంటెంట్ జనరల్ (ఏజీ)ని ఆదేశించారు. వాహనాల కొనుగోలు ప్రక్రియతో పాటు మార్పుల కోసం అయిన ఖర్చులను కూడా పరిశీలించాలని సూచించారు. అక్రమాలు జరిగినట్టు రుజువైతే కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు.

**అనవసరంగా ఖర్చు చేస్తే సహించం**

వాహనాలకు అదనపు హంగుల కోసం పెట్టిన ఖర్చు సహేతుకమా, కాదా అనేది తేల్చేందుకే ప్రత్యేక ఆడిట్ చేయాలని ఆదేశించినట్టు మంత్రి గణేష్ రామ్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు రుజువైతే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. అటవీశాఖ అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో కొన్ని మార్పులు చేస్తుంటారని చెప్పారు. అడవుల్లో విధులు నిర్వహించేందుకు అనువుగా ఉండేలా వాహనాల్లో అదనపు లైట్లు, కెమెరాలు, సైరన్‌లు, ప్రత్యేక టైర్లు, ఇతర పరికరాలను అమర్చుతారని తెలిపారు. అయితే అధికంగా లేదా అనవసరంగా చేసే ఎలాంటి ఖర్చునైనా తాము సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

**మార్పులు అవసరం**

తాము కొనుగోలు చేసిన వాహనాలకు అవసరానికి మించి ఖర్చు చేశామా, లేదా అనేది ఆడిటింగ్ తేలుతుందని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. తమ శాఖ విధులకు అనుగుణంగా వాహనాలకు మార్పులు చేయడం అవసరమని వారు చెబుతున్నారు. ఫ్రంట్‌లైన్ సిబ్బంది పెట్రోలింగ్, దావానలం నియంత్రణ, వన్యప్రాణుల రక్షణ, కలప అక్రమ రవాణా నివారణ, పర్యాటకుల జంగిల్ సఫారీల కోసం ఈ వాహనాలను వినియోగిస్తామని చెప్పారు. సిమిలిపాల్ టైగర్ రిజర్వ్, సత్కోసియా టైగర్ రిజర్వ్, డెబ్రిఘర్ వన్యప్రాణుల అభయారణ్యం సహా ఇతర ముఖ్యమైన వన్యప్రాణి సంరక్షణ ప్రాంతాల్లో విధులకు ఈ కస్టమైజ్డ్ ఎస్‌యూవీలను వినియోగిస్తున్నట్టు తెలిపారు.

# ఆశ్చర్యపరిచే నిర్ణయాలు!

కేంద్రంలోని నరేంద్ర మోదీ 3.ఓ ప్రభుత్వం మరోసారి ఆశ్చర్యపరిచే నిర్ణయాలు తీసుకోబోతోంది. యువతను ప్రోత్సహించేలా కీలక నిర్ణయాలు తీసుకునేందుకు రెడీ అవుతోంది. యువ నాయకత్వంపై మోదీ సర్కారు ఫోకస్ పెంచింది. ప్రభుత్వంలో వారికి పెద్దపీట వేయడానికి సిద్ధమవుతోంది. కేంద్ర కేబినెట్‌లో యువ నేతలకు మరిన్ని కొలువులు కట్టబెట్టడానికి కసరత్తు చేస్తోంది. మోదీ 3.ఓ కేబినెట్‌లో యువతరానికి త్వరలో తగిన ప్రాధాన్యం దక్కబోతోంది. దీనికి కొంత సమయం పడుతుందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడంతో కమలనాథులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నిల్లోనూ ఇదే జోరు చూపించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని కార్యాచరణలోకి దిగిపోయారు. వచ్చే ఏడాది మార్చి- ఏప్రిల్ మధ్యలో జరగను న్న బెంగాల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. దీదీని నాలుగోసారి సీఎం కాకుండా అడ్డుకోవాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ అగ్రనేతలు బెంగాల్ పర్యటనలు చేస్తూ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా బెంగాల్‌లో సభలు నిర్వహిస్తూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.

**ఆశ్చర్యపరిచే నిర్ణయాలు**

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత మోదీ సర్కారు ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకోబోతోందని సమాచారం. కేంద్ర కేబినెట్ విస్తరణతో పాటు మరిన్ని కీలక నిర్ణయాలు ఉంటాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్టు 'ది సండే గార్డియన్స్ నివేదించింది. బిహార్ ఎన్నికల ఫలితాల తర్వాత 45 ఏళ్ల నితిన్ నబీన్‌ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించి అందరినీ బీజేపీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అదే విధంగా బెంగాల్ ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ఎవరూ ఊహించని నిర్ణయాలు ఉంటాయని తెలుస్తోంది.

**యువతకు పెద్దపీట**

పార్టీ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వానికి కేంద్ర కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమాచారం. ఒకవేళ బెంగాల్‌లో తమకు అనుకూలంగా



ఫలితాలు వస్తే ఆ రాష్ట్రం నుంచి మరికొంత మందికి కేబినెట్ బెర్త్‌లు దక్కే చాన్స్ ఉంది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు సహాయ మంత్రులు ఉన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అద్భుతమైన పనితీరు కనబరిస్తే.. ఇద్దరు పూర్తిస్థాయి కేంద్ర మంత్రులను నియమించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమచారం.

**పనితీరే గీటురాయి**

జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్‌ను ఎంపిక చేయడానికి ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారో దాదాపు వాటినే కొత్త మంత్రుల ఎంపికలో పాటిస్తారని తెలుస్తోంది. ఎటువంటి వివాదాలు లేకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయడంతో పాటు ఎక్కువ కాలం బాధ్యతలు చేపట్టగల యువ నాయకులకు అవకాశం ఇస్తారని సమాచారం. పార్టీకి ఎక్కువ కాలం పాటు బాధ్యతలు చేపట్టగల సామర్థ్యంతో పాటు, స్థిరమైన సంస్థాగత పనితీరుతో మంచి ఫలితాలు రాబట్టగలిగే యువ నేతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సామాజిక, ప్రాంతీయ సమతుల్యత పాటిస్తూనే.. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం దక్కేలా ఎంపికలు ఉంటాయని సమాచారం.

**కేబినెట్‌లో 10 ఖాళీలు!**


ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంత్రివర్గంలో 72 మంది మంత్రులు ఉన్నారు. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం గరిష్టంగా 81 మందిని మంత్రులుగా నియమించే అవకాశం ఉంది. ఈ లెక్కన చూస్తే ప్రస్తుత కేబినెట్‌లో 9 ఖాళీలు ఉన్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి బీజేపీ ఇటీవల ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయనున్నారు. దీంతో కేబినెట్‌లో ఖాళీల సంఖ్య 10కి చేరుతుంది. ప్రధానిగా తన రెండవ హయాంలో 78 మంత్రులకు కేబినెట్‌లో చోటు కల్పించారు. దీని ప్రకారం చూసుకున్నా ప్రస్తుత మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. కేబినెట్ విస్తరణలో ఈ ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. చూడాలి బెంగాల్ ఎన్నికలు ఎవరిని అందలం ఎక్కిస్తాయో!

## బంగ్లాదేశ్‌లో హింస..
## ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న హింస పట్ల యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ వ్యక్తిని కొట్టి చంపిన ఘటన పట్ల ఆయన రియాక్ట్ అయ్యారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు ఆందోళన కలిగిస్తున్న విషయం వాస్తవమే అని యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ తెలిపారు. ప్రెస్ మీట్‌లో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్న అంశంపై స్పందన కోరగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ అయినా మరే ఇతర దేశమైనా, మెజార్టీకి చెందని ప్రజలు సురక్షితంగా ఉండాలని, బంగ్లాదేశీయులందరూ సేఫ్‌గా ఉండాలని, దేశంలోని ప్రతి పౌరుడు సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని విశ్వాసంతో ఉన్నట్లు డుజారిక్ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని అనేక మీడియా సంస్థలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మీడియా సంస్థలను టార్గెట్ చేయడంలో తమ జీవన హక్కు ప్రమాదంలో పడినట్లు బంగ్లా జర్నలిస్టులు ఆరోపించారు. బంగ్లా మీడియా ప్రస్తుతం దీన అవస్థలో ఉన్నదని, భావస్వేచ్ఛను హరించారని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఢాకాలో ఉన్న ప్రోతమ్ ఆలో, ద డెయిలీ స్టార్ వార్తాపత్రికల ఆఫీసులకు నిప్పు పెట్టిన ఘటన నేపథ్యంలో పలువురు ఎడిటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫీసులకు నిప్పుపెట్టిన సమయంలో చాలా మంది జర్నలిస్టులు లోపలే చిక్కుకుపోయారని, పోలీసులు.. ఫైర్ సర్వీసులను రాకుండా అడ్డుకున్నారని ఎడిటర్లు ఆరోపించారు. భావస్వేచ్ఛ ఇప్పుడో సమస్య కాదు అని, అసలు బ్రతికి ఉండడమే ఇప్పుడు సమస్యగా మారినట్లు డెయిలీ స్టార్ ఎడిటర్ మహఫూజ్ ఆనమ్ తెలిపారు.

## భారత్ 'మెగా రోడ్డు'తో డ్రాగన్‌కు చుక్కలే..

**న్యూఢిల్లీ:** తరచూ దుందుడుకు చర్యలకు పాల్పడే చైనాకు భారత్ అడ్డుకట్ట వేస్తోంది. చైనా సరిహద్దు వెంబడి భారత్ మరో భారీ వ్యూహాత్మక అడుగు వేసింది. ఉత్తరాఖండ్‌లోని నీలపాణి నుండి ములింగ్ లా వరకు 16,134 అడుగుల అత్యంత ఎత్తైన ప్రాంతంలో 32 కిలోమీటర్ల మేర నిర్మితమవుతున్న'మెగా రోడ్డు' పనులను భారత్ ముమ్మరం చేసింది. అన్ని వాతావరణాలను తట్టుకునేలాంటి రహదారి నిర్మాణాన్ని చేపట్టింది. రూ. 104 కోట్ల వ్యయంతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) చేపడుతున్న ఈ ప్రాజెక్టు, వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ)వద్ద భారత సైనిక



సామర్థ్యాన్ని మరింత పెంచనున్నది. ప్రస్తుతం ములింగ్ లా బేస్ క్యాంపు చేరుకోవాలంటే సైనికులు ఐదు రోజుల పాటు కఠినమైన కొండ మార్గాల్లో ట్రెక్కింగ్ చేయాల్సి వస్తున్నది. శీతాకాలంలో భారీ హిమపాతం కారణంగా ఈ మార్గం పూర్తిగా మూసుకుపోతుంటుంది. దీంతో కేవలం హెలికాప్టర్ల ద్వారానే ప్రయాణం చేయాల్సి వస్తుంది. అయితే ఈ నూతన రహదారి పూర్తయితే, ఐదు రోజుల ప్రయాణం కేవలం కొద్ది గంటల్లోనే ముగియనుంది. తద్వారా దళాల మోహరింపు, రేషన్, ఇంధనం, యుద్ధ సామగ్రిని ఏడాది పొడవునా ఎటువంటి ఆటంకం లేకుండా నేరుగా సరిహద్దుకు చేరవేసే అవకాశం కలుగుతుంది. ఒకప్పుడు సరిహద్దుల్లో రహదారులు నిర్మిస్తే చైనా చొరబడుతుందని భారత్ భావించింది. ఇప్పుడు ఈ సిద్ధాంతాన్ని పక్కనపెట్టి,'కనెక్టివిటీయే బలం' అనే దిశగా అడుగులు వేస్తోంది. టిబెట్ ప్రాంతంలో చైనా ఇప్పటికే భారీగా రోడ్డు, రైలు నెట్‌వర్క్‌ను నిర్మించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా తన మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తోంది. 2020 తూర్పు లడఖ్ ప్రతిష్టంభన తర్వాత, సరిహద్దుల్లోని చివరి మైలు వరకు సైనిక కనెక్టివిటీని పెంచడమే లక్ష్యంగా మెగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. హిమాలయాల్లోని అత్యంత కఠినమైన భూభాగంలో సాగుతున్న ఈ రోడ్డు నిర్మాణం ఇంజనీరింగ్ పరంగా పెద్ద సవాలుతో కూడుకున్నది. ఈ రహదారి పూర్తయితే వాయు సేనపై ఆధారపడే అవసరం తగ్గి, రక్షణ వ్యయం గణనీయంగా ఆదా కానుంది. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు పటిష్టంగా ఉంటేనే, వేగవంతమైన ప్రతిస్పందన సాధ్యమని భారత్ భావిస్తోంది. తద్వారా సరిహద్దు ప్రాంతాలు మరింత సుస్థిరంగా ఉంటాయని రక్షణ నిపుణులు అంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో చైనా చొరబాట్లకు భారత్ సమర్థవంతంగా అడ్డుకట్ట వేయగలదని చెబుతున్నారు.

## చైనా, పాక్‌ల నుంచి ముప్పు..
## భారత్ సిద్ధంగా ఉండాలి



అణు దేశాలైన చైనా పాకిస్థాన్‌ల నుంచి ముప్పు పొంచి ఉన్నదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తుచేశారు. స్వల్పకాలిక, సుదీర్ఘ యుద్ధాలకు భారత్ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన ఇద్దరు ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారని, ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఇప్పటికే కొనసాగుతోన్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు రెడీగా ఉండాలన్నారు. కృత్రిమ మేథ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ పోరాట తీరును మారుస్తున్నాయని చెప్పారు.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2
## మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం



కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3-ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## ఇండోపాక్ న్యూక్లియర్ వార్ ఆపాను

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ ఆ విషయాన్నే స్పష్టం చేశారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య సంక్షోభాన్ని పరిష్కరించినట్లు చెప్పారు. లక్షల సంఖ్యలో ప్రజల జీవితాలను కాపాడారని, పాక్ సర్కారు తనను మెచ్చుకున్నట్లు కూడా ఆయన తెలిపారు. భారత్, పాక్ మధ్య అణ్వాయుధ యుద్ధాన్ని నిలువరించామని, పాకిస్థాన్ అధినేత, గౌరవప్రదమైన జనరల్, ఫీల్డ్ మార్షల్‌తో పాటు ఆ దేశ ప్రధాని కూడా తన మధ్యవర్తిత్వాన్ని మెచ్చుకున్నట్లు చెప్పారు. ప్రెసిడెంట్ ట్రంప్ సుమారు కోటి మంది లేదా అంత కన్నా ఎక్కువ మంది ప్రాణాలు కాపాడినట్లు పాకిస్థాన్ ప్రశంసించి నట్లు ఆయన పేర్కొన్నారు. ఫ్లోరిడాలోని మార్-ఏ-లాగో ఎస్టేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. డిఫెన్స్ సెక్రటరీ ఈట్ హెగ్‌సేథ్, నేవీ మంత్రి జాన్ పెలాన్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మీకు తెలుసు కదా 8 విమానాలను కూల్చేశారని, ఆ యుద్ధం మళ్లీ ఉగ్రంగా మారే సమయంలో, ప్రెసిడెంట్ ట్రంప్ కోటి మంది ప్రాణాలను కాపాడారని అన్నారని, అన్ని యుద్ధాలను పరిష్కరించామని, కానీ ఒకే ఒక్క యుద్ధం పరిష్కరించ లేదని, ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని తాను ఆపలేకపోయినట్లు ట్రంప్ తెలిపారు. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7వ తేదీన ఆపరేషన్ సింధూర్ చేపట్టగా, ఇండియా.. పాక్ మధ్య సంధి కుదిరినట్లు మే 10వ తేదీన ట్రంప్ ప్రకటించారు. వాషింగ్టన్‌లో రాత్రంతా జరిగిన చర్చల తర్వాత పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ కుదిరినట్లు ట్రంప్ తన సోషల్ మీడియాలో వెల్లడించారు. అయితే ఆ నాటి నుంచి ఇప్పటి వరకు కనీసం 60 కన్నా ఎక్కువ సార్లు ఇండియా, పాక్ యుద్ధాన్ని ఆపినట్లు ఆయన చెబుతూనే ఉన్నారు. ఇండోపాక్ ఉద్రిక్తతలను తగ్గించినట్లు చెప్పారు. కానీ భారత ప్రభుత్వం మాత్రం మూడవ దేశ జోక్యాన్ని ఖండించింది. రెండు దేశాలు ఓ ఒప్పందం ప్రకారం సంయుక్తంగా మే 10వ తేదీన యుద్ధాన్ని ఆపేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

**ఏఓబీ సరిహద్దులో లొంగిపోయిన 22 మంది మావోలు**

**లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు**

**లొంగిపోయిన మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు**

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే-47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది. తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.

# తగ్గుతున్న నిఘా, పెరుగుతున్న కేసులు

-మొదటిపేజీ తరువాయి

41,800, సైబరాబాద్‌లో 42,360, రాచకొండలో 15,970 మంది పాత నేరస్థులు ఉన్నట్లు గుర్తించారు. అలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.8 లక్షల మంది ఉన్నట్లు వివరాలను సేకరించారు.

అంతర్రాష్ట్ర నేరస్థుల చిట్టానూ వారు తేల్చారు. పోలీసులంతా పాత నేరస్థుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. నేరస్థుల ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, వేలిముద్రలు, పాన్‌కార్డు, గ్యాస్, విద్యుత్తు కనెక్షన్ల, సామాజిక మాధ్యమ ఖాతాల సమాచారం వివరాలు ఆరా తీయడమే కాకుండా ఆయా ధ్రువీకరణ పత్రాల ప్రతులను సైతం సేకరించారు. నేరస్థుల ప్రస్తుత, శాశ్వత చిరునామాలతో కూడిన ఇళ్లకు జియో ట్యాగింగ్ సైతం చేశారు. ఇలా పలు అంశాలతో కూడిన సమగ్ర వివరాలను సేకరించారు. అలా సేకరించిన నివేదికలో నిక్షిప్తం చేశారు.

**విలువైన సమాచారం ఉంది, వినియోగం ఏదీ**

ముందుగా చేపట్టిన 30 శాతం మంది వరకు నేరస్థుల ఆచూకీ లభించలేదు. అలాంటివాళ్లే కరడుగట్టిన నేరాలకు పాల్పడుతున్నారని భావించారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. అలాంటి వారి విలువైన సమాచారం సేకరించారు. అయితే, తర్వాత ఆ సమాచారంతో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే ప్రణాళిక లోపించింది. దీంతో వ్యవస్థీకృత నేరాల నియంత్రణకు అవసరమైన విలువైన సమాచారం నిష్ప్రయోజనంగా మారిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పాత నేరస్థులపై తరచూ నిఘా ఉంచితే నిజామాబాద్, హైదరాబాద్ లాంటి ఘటనలు పునరావృతం అయ్యే పరిస్థితులు దాదాపు ఉండవనే భావన కలుగుతోంది.

**రాష్ట్రంలో జరిగిన కొన్ని సంఘటనలు :**

హైదరాబాద్‌లో సెల్ ఫోన్ చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడు అన్సారీ ఓ కానిస్టేబుల్‌తో పాటు ఏకంగా ఐపీఎస్ అధికారిపైనే కత్తితో దాడికి యత్నించిన ఘటన అప్పట్లోనే సంచలనం రేపింది. 20కి పైగా నేరాల్లో ప్రమేయమున్న అన్సారీ అంతగా బరితెగించేంత వరకు ఎందుకు పోలీసులు ఎందుకు నిలువరించలేకపోయారనే ప్రశ్న అందరిలో మెదులుతోంది.

గత అక్టోబరులో నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి హత్య చేసి అనంతరం ఎన్‌కౌంటర్‌లో మరణించిన రియాజ్ 2021 నుంచి నేరాలకు పాల్పడుతున్నాడు. చోరీల నుంచి మొదలుకొని హత్యల వరకు మొత్తం 61 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రియాజ్ నాలుగేళ్లుగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నప్పటికీ అతడిపై నిఘా ఉంచడంలో మాత్రం పోలీసు శాఖ విఫలమైందనే ఆరోపణలు సైతం వస్తున్నాయి.

# కేసీఆర్ గేర్ మార్చారా... పాలమూరు జిల్లా టార్గెట్..

**హైదరాబాద్ :** రేవంత్ పేరును ప్రస్తావించకుండానే..గట్టిగానే అటాక్ చేశారు కేసీఆర్. రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌కు చెందిన కృష్ణా జలాల వాటా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సెంట్రిక్‌గా కేసీఆర్ ఇండైరెక్ట్‌గా రేవంత్ రెడ్డిపై సీరియస్ కామెంట్స్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపితే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఫైరయ్యారు. డీపీఆర్ను వెనక్కి పంపితే భూమి, ఆకాశాన్ని ఏకం చేసి లొల్లి చేయాల్సింది పోయి ప్రభుత్వం సైలెంట్‌గా ఉందని పరోక్షంగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు కేసీఆర్.పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టి తీరుతామ్. పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామ్. బహిరంగ సభలకు తాను స్వయంగా హాజరవుతానంటూ..ఇక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతానని చెప్పకనే చెప్పారు గులాబీ బాస్. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందాలే తప్ప.. వేరే ధ్యాసే లేదని రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని.. అన్యాయాలపై ప్రశ్నిస్తామని హెచ్చరించారు.అయితే ఎక్కడా కేసీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పలకలేదు. రేవంత్ పేరును ప్రస్తావించకుండానే ఓ రేంజ్‌లో విమర్శలు, ఆరోపణలు చేయడం మరోసారి సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆఖరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరును పలికిన కేసీఆర్, రేవంత్ రెడ్డి పేరును మాత్రం పలకకపోవడం ఆసక్తికరంగా మారింది. రేవంత్ పేరును తీయకుండానే ఆయనపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారన్న చర్చ సాగుతోంది.ఇక సీఎం రేవంత్ రెడ్డి యాజ్ టీజ్‌గా మాజీ సీఎం కేసీఆర్‌ను నేరుగా టార్గెట్ చేశారు. పదేళ్ల పాలనలో తెలంగాణను 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన కేసీఆర్ ఒక ఆర్థిక ఉగ్రవాది అంటూ మండిపడ్డారు. కలుగులో దాక్కున్న ఎలుకలా ఇన్నాళ్లూ మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటకు వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే జనవరి 2న జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావాలని..తెలంగాణకు ఎవరు మేలు చేశారో అక్కడే తేల్చుకుందామంటూ సవాల్ చేశారు రేవంత్.పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ తీరు మారలేదని..కమీషన్ల కోసమే రాష్ట్రాన్ని అప్పుల పాలు



చేశారంటూ దుమ్మెత్తిపోశారు. అయితే రేవంత్ రెడ్డి పేరు తీయకుండా కేసీఆర్ సీఎం సొంత జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణాజలాల అంశాలను బేస్ చేసుకుని టార్గెట్ చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం యథావిధిగా కేసీఆర్‌ను టార్గెట్ చేయడం చర్చకు దారితీస్తోంది. ఇక ఇప్పుడు కేసీఆర్ యాక్టీవ్ కాబోతుండటంతో తెలంగాణలో ఇకపై రాజకీయం రంజుగా ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.

**టార్గెట్ సాగునీటి ప్రాజెక్టులు**

గులాబీ అధినేత కేసీఆర్ మొత్తానికి ఫామ్హౌస్ నుంచి బయటికి వచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని నంది నగర్ లో తన నివాసానికి వచ్చారు. చాలా రోజుల తర్వాత కెసిఆర్ బయటికి రావడంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సంచలనం నెలకొంది. కెసిఆర్ ఇప్పటికిప్పుడు బయటకు రావడం వెనుక బలమైన కారణం ఉంది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ బయటకు కనిపించడం అత్యంత అరుదుగా మారింది. పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైపోయారు. గులాబీ పార్టీ పాతిక సంవత్సరాల పండుగకు ఆయన వరంగల్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఓ టీవీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యారు. ఇటీవల తన మేనల్లుడు హరీష్ రావు తండ్రి చనిపోతే కేసీఆర్ బయటికి వచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్ గా కెసిఆర్ పేరు పేర్కొన్నప్పటికీ.. ఆయన బయటికి రాలేదు.తనను కలిసే నేతలతో మాత్రమే కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేటీఆర్, హరీష్ రావు తో అప్పుడప్పుడు సమావేశం అవుతున్నారు.. ఎన్నికల్లో, వివిధ సందర్భాలలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాల గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఇన్ని రోజుల తర్వాత కెసిఆర్ బయటికి వచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానమైన చర్చ జరుగుతుందని సమాచారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల పోలవరం నల్లమల సాగర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. దీనిపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపాదించిన పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుపై కూడా చర్చ జరుగుతుందని తెలుస్తోంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల కృష్ణా నీటితో సర్దుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన తీరును గులాబీ పార్టీ తప్పుపడుతోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు 90 టీఎంసీల నీటి కోసం పోరాటం చేసామని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 45 టీఎంసీలకు ఇలా ఒప్పుకుంటుందని గులాబీ పార్టీ ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపై ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని గులాబీ అధినేత భావించినట్టు సమాచారం. ఉద్యమ కార్యాచరణకు సంబంధించి తేదీలను మాత్రం ప్రకటించకపోవచ్చని.. ఎందుకంటే త్వరలో స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికలు జరగబోతున్నాయని.. అందువల్లే పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.. చాలాకాలం తర్వాత కెసిఆర్ బయటికి వచ్చిన నేపథ్యంలో రేవంత్ రెడ్డికి సవాళ్లు విసిరే అవకాశం లేకపోలేదని? మరి దీనిని ముఖ్యమంత్రి ఎలా స్వీకరిస్తారో చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# గ్రేటర్‌పై రేవంత్ గురి

**హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు గేర్ మారుస్తున్నారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వరకు కాస్త స్లోగా..నెమ్మదిగా వెళ్లినట్లు కనిపించిన ముఖ్యమంత్రి..ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు. వెంటనే పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మూడు విడతల్లో పల్లెపోరును కంప్లీట్ చేశారు. మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుని ఇంకా ఫుల్ జోష్‌లోకి వచ్చారు. ఈ క్రమంలో రాజకీయంగా వేగంగా పావులు కదుపుతున్నారు. పొలిటికల్ ఈక్వేషన్స్‌ను తనకు అనుకూలంగా మార్చుకుంటూ..ఒక్కో స్టెప్ ముందుకేస్తున్నారు.పంచాయతీ ఎన్నికల గెలుపుతో..గ్రేటర్ ఎన్నికలపై దృష్టి పెట్టారట సీఎం. తెలంగాణకు ఆర్థికంగానే కాదు.. రాజకీయంగా కూడా..హైదరాబాద్ గుండె లాంటిది. అయితే హైదరాబాద్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీని కూడా గెలువలేకపోయింది కాంగ్రెస్. అధికారంలోకి వచ్చిన తర్వాత..ఎమ్మెల్యేల మరణంతో వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించి..గ్రేటర్‌లో రెండు సీట్లను తమ ఖాతాలో వేసుకోగలిగింది హస్తం పార్టీ. అటు పంచాయతీ పోల్స్, ఇటు రెండు బైఎలక్షన్లలో గెలుపు..ఇదే ఊపుతో గ్రేటర్‌లో పాగా వేసేలా పావులు కదుపుతోంది కాంగ్రెస్ పార్టీ.రేవంత్ రెడ్డి ఇప్పటినుంచే గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్ పెట్టారట. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 150 డివిజన్లున్నాయి. అయితే పెరుగతున్న జనాభా..నగర విస్తరణ.. ఇప్పటికే మెర్జ్ అయిన మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల జనాభాను దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటుంది రేవంత్ సర్కార్. ఔటర్ రింగ్ రోడ్



వరకు..గ్రేటర్‌ను విస్తరించాలని డిసైడ్ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 300 డివిజన్లు కానున్నాయి. ఈ డివిజన్ల ఏర్పాటు కూడా తుది దశకు చేరుకుంది. డివిజన్ల ఏర్పాటు పూర్తవగానే..రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేసి..ఎన్నికలకు వెళ్లాలనేది రేవంత్ రెడ్డి వ్యూహం అంటున్నారు.ఇంతలోపు గ్రేటర్ అభివృద్ధి ఫోకస్ చేస్తూ?. ఎన్నికలకు వెళ్లాలన్నది రేవంత్ ఆలోచనగా కనిసిస్తోంది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ కావడం..సమ్మిట్ లో వచ్చిన 5 లక్షల కోట్ల పెట్టుబడులను ఎక్స్‌పోజ్ చేసుకోవాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుందట. మెట్రో విస్తరణ, ముఖ్యంగా పాతబస్తీకి మెట్రో..ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ డెవలప్ మెంట్ కారిడార్..ఇలాంటి అంశాలపై రేవంత్ రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. దీంతో నగరవాసుల్లో కాంగ్రెస్‌పై పాజిటివిటి పెరిగిందని భావిస్తున్నారట కాంగ్రెస్ లీడర్లు. దీంతో పాటు వచ్చే నెలలో దావోస్ పర్యటనతో సీఎం రేవంత్ పెట్టుబడులు తీసుకొస్తారని అంచనా వేస్తున్నారు.ఇక ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీ పాలక మండలి పదవి కాలం ముగుస్తుండటంతో..జనవరి నెలాఖరులో గ్రేటర్ నగారా మోగించాలని రేవంత్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు టాక్. ఇక అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమం ఇవన్నీ ఒక ఎత్తు అయితే..ఎంఐఎం పార్టీతో దోస్తీ మరింత కలసి వస్తుందని భావిస్తోందట అధికార పార్టీ. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో ముస్లిం ఓట్లు తమకు కన్వర్ట్ కావడంతో పాటు..ఎంఐఎంతో కలిసి గ్రేటర్ పీఠాన్ని సొంతం చేసుకోవచ్చనేది రేవంత్ ఈక్వేషన్ అంటున్నారు.ఒకవైపు పంచాయతీ ఎన్నికల్లో గెలుపు, జూబ్లిహిల్స్‌లో విక్టరీ, గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తో?.. ఇదే సరైన సమయంగా భావిస్తున్న రేవంత్ రెడ్డి?. గ్రేటర్‌తో పాటు..మరికొన్ని కార్పొరేషన్, మున్సిపాలీటలను కైవసం చేసుకోవాలని ఎత్తులు వేస్తున్నారట. ఆ తర్వాత..ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా చెబుతున్నారు. రేవంత్ గ్రేటర్ వ్యూహం ఎంత వరకు వర్కౌట్ అవతుందో చూడాలి

## ఉద్యోగుల సమస్యలపై స్పెషల్ ఫోకస్..

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డి. ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

**ఆ పాలసీ లేకపోవడంతో సమస్యలు..**

'ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయి. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్ ప్యూర్ రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**అధికారుల సహకారం ఉండాలి..**

'ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం ఉండాలి. అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి. ప్రతీ నెల కార్యదర్శుల పనితీరుపై సీఎస్ సమీక్షిస్తారు. కార్యదర్శులు సీఎస్‌కు ప్రతీ నెల రిపోర్ట్ సమర్పించాలి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి మీ పనితీరుపై నేనే స్వయంగా సమీక్షిస్తా. ఆయా శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావు. అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయడం అత్యంత కీలకం. తెలంగాణ అభివృద్ధి విషయంలో శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక మెకానిజం ఏర్పాటు చేసుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## సీఎం చిట్‌చాట్‌ల పేరుతో దాక్కోవద్దు

-మొదటిపేజీ తరువాయి

పాలనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి రెండేళ్లలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా, ప్రత్యర్థులపై కేసులు వేసే పనిలో మాత్రమే జోరుగా ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. మీడియాకు లీకులు ఇవ్వడం, నోటీసుల డ్రామాతో ప్రజల దృష్టిని వేరే దిశగా మళ్లించడం చేస్తున్నారని విమర్శించారు. నదీ జలాలపై రేవంత్‌కు ఏమాత్రం అవగాహన లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సాగునీటిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటిందని... రేవంత్ కు దమ్ముంటే సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోవడం వల్లే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌ల పేరుతో దాక్కోవడం కాదు దమ్ముంటే బయిటకొచ్చి కేసులపై మాట్లాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా రోజుకో కేసు అంటూ లీకులిస్తుందని ఆయన ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ గర్జిస్తే కాంగ్రెస్ నేతలెవరూ సమాధానం చెప్పలేకపోయారని వారికి ఆ దమ్ములేదని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా కాంగ్రెస్‌కు లేదని కేటీఆర్ మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేస్తే మిగిలిన 10 శాతం పనులను ఈ ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలు చేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ఎన్నికలకు ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు.

ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే సహకార ఎన్నికలు పెట్టాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్నట్లు, బీఆర్ఎస్ కార్యకర్తల దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడకూడదని కార్యకర్తలను ఉద్దేశించి కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

గత ఆదివారం జరిగిన బీఆర్ఎస్ఎల్పీ భేటీలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కారు గుర్తుతో స్థానిక ఎన్నికలు జరిగి ఉంటే ఫలితాలు బీఆర్ఎస్‌కు మరింత అనుకూలంగా ఉండేవన్నారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు కేటీఆర్‌కు నోటీసులు ఇ?వ్వాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. దానితో పాటు 2023లో బీఆర్ఎస్ హాయాంలో హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా వన్ రేసు అవినీతి కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్నారు.

## మత్తు'లో యువతరం

-మొదటిపేజీ తరువాయి



కేసులు పెట్టారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 3.25 కిలోల గంజాయిని కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా, ఎక్సైజ్ పోలీసులు వారిని పట్టుకున్నారు. అనంతరం వారిద్దరిని రిమాండ్‌కు పంపించారు. పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గేటు సమీపంలో పరిగికి చెందిన ఒకరు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన మరో యువకుడి దగ్గరి నంచి 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏపీలో గత నెల 9న విశాఖ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న రైలులో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం అందడంతో ఆబ్కారీ అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు 26 కిలోల ఎండు గంజాయిని వికారాబాద్ రైల్వే ఆసుపత్రి సమీపంలో స్వాధీనపర్చుకున్నారు.

**నిరంతరం పర్యవేక్షిస్తున్నా - మార్పు లేదు**

గంజాయి చాలావరకు కర్ణాటక రాష్ట్రం నుంచి ఇక్కడి జిల్లాకు సరఫరా అవుతోందని పోలీసులు అన్నారు. అమాయకులనే లక్ష్యంగా చేసుకుని కొందరు స్వార్థపరులు ఈ దందాను నడిపిస్తున్నారని చెప్పారు. ఈ ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారని అధికారులు తెలిపారు. అలాగే నిరంతరం పర్యవేక్షిస్తునే ఉన్నారని అన్నారు. అయినప్పటికీ ఈ విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదన్నారు. పరిగి, వికారాబాద్, మోమిన్‌పేట, తాండూరు, బషీరాబాద్ వంటి తదితర ప్రాంతాల్లో తరచూ కేసులు నమోదవుతూనే ఉన్నాయని తెనిపారు.

**రైలు మార్గంలో**

ఇక్కడ రైలు సదుపాయమూ ఉండటంతో తాండూరు, వికారాబాద్ మీదుగా రవాణా అవుతోందని చెప్పారు. పొరుగు జిల్లా సంగారెడ్డిలోనూ కేసులు కలకలం రేపుతున్నాయని అన్నారు. రంగారెడ్డి జిల్లా బాలానగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పరిగికి తక్కువ దూరం కావడంతో అక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయని అన్నారు.

చాక్లెట్ల రూపంలో : విక్రయదారులు గంజాయిని వివిధ రూపాల్లో అందిస్తున్నారని సమాచారం. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారని అన్నారు. నాలుగు నెలల కిందట రంగారెడ్డి జిల్లా కొందర్గు నుంచి తెచ్చి పరిగిలో విక్రయిస్తున్నట్లు అనుమానం రావడంతో వారిని పట్టుకుందామని కృషి చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు వెనక్కి వెళ్లిపోయారని చెప్పారు. పోలీసు, ఆబ్కారీ అధికారులు తనిఖీలు విస్తృతం చేసి ఈ గంజాయిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

దాందాకు చెక్ పెట్టేందుకు సరికొత్త ఏఐ టూల్స్

తెలంగాణలో మత్తు దందాను అరికట్టేందుకు ఈగల్? టీం ఏఐ టూల్స్?ను సిద్ధం చేసింది. సహాయ్?, షీల్డ్? పేరుతో తెలంగాణ ఈగల్? వెబ్?సైట్?లో పెట్టింది. ఎవరైనా తమకు డ్రగ్స్? గురించి ఎలాంటి సమాచారం తెలిసినా ఇందులో పంచుకునేలా రూపొందించారు. మరోవైపు షీల్డ్? పేరుతో రూపొందించిన ఏఐ టూల్?తో అనుమానాస్పద పరిస్థితులు ఉంటే ఎక్కువ ప్రమాద స్థాయి, లేకపోతే ముప్పు తక్కువగా ఉన్నట్లు ఇది గుర్తిస్తుంది. ఇక్కడ ఎవరిని సంప్రదించాలో ఫోన్? నంబరు కూడా తెరపై ప్రత్యక్షం అవుతుంది.


# సంపాదకీయం

## వినియోగదారుల హక్కుల పరిరక్షణ

# నెరవేరుతున్నదా!

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. భారత దేశంలో 1986లో వినియోగదారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగదారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు.. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగదారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగదారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కులపట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ-కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసుకుంటున్నాయి. వినియోగదారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగదారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచంలోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారతదేశంలో తొలిసారి 1986లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగదారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్‌గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ- జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలుశిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగదారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియజేయాలి.

# ఐటి ఉద్యోగులకు ఏఐ ఎసరు




ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఊడ్చేస్తోంది. ఒకప్పుడు తిరుగులేని ఉద్యోగ రంగంగా ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో కొలువు. ఈ రోజుల్లో గాల్లో దీపంలా మారింది. గతంలో ఓ ఉద్యోగిని తొలగించారంటే ఎన్నో కారణాలు ఉండేవి. ఈ ఏడాది ఎఐ కారణంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్షన్నర ఉద్యోగాలు పోయినట్లు అంతర్జాతీయ గణాంకాలు చెబుతుండగా, వీటిలో నూటికి 90 టెక్ ఉద్యోగాలే కావటం గమనార్హం. ఇలా ఉద్యోగాలు పీకేసిన సంస్థల్లో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి కంపెనీలుండటం గమనార్హం. వీటిలో ఒక్క టిసిఎస్ సుమారు 20 వేల ఉద్యోగులను ఇంటికి పంపింది. గతంలో ఎవరి ఉద్యోగమైనా పోతే.. అనేక కారణాలుండేవి. కానీ, ప్రస్తుతం ఏ టెక్ సంస్థ అయినా లేఆఫ్ ప్రకటించిందంటే దానికి ఎఐ ప్రభావమే కారణమవుతోంది. ఈ నేపథ్యంలో టెక్ రంగంలోని ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిళ్ల మధ్య పనిచేయాల్సి వస్తోంది. ఏ రోజుకారోజు దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షుఅన్నట్లుగా వారు భయభయంగా ఉద్యోగాలు చేస్తున్నారు. రాబోయే ఐదేండ్లలో తమ ఉద్యోగులను పెద్దమొత్తంలో తొలగించనున్నట్టు 41% కంపెనీలు పేర్కొన్నట్టు వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) ఇటీవల ఒక నివేదికలో వెల్లడించింది. ప్రధాన రంగాల్లోకి ఎఐ ప్రవేశించడమే దీనికి కారణంగా వివరించింది. అమెజాన్ ఎఐలో భారీ పెట్టుబడులు పెడుతోంది. 2025 నాటికి ఎఐ మెషిన్ లెర్నింగ్‌లో సుమారు ఎనిమిదిన్నర లక్షల కోట్లు ఖర్చు చేయడానికి కంపెనీ సిద్ధంగా ఉందని ప్రకటించింది. ఈ పెట్టుబడులతో, సంస్థలోని హై-పెయిడ్ వైట్-కాలర్ ఉద్యోగులను ఎఐద్వారా భర్తీచేయాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇప్పుడు విస్తృత చర్చకు దారితీస్తోంది. అమెజాన్ లేఆఫ్‌ల ప్రత్యక్ష ప్రభావం భారతదేశంపై పెద్దగా ఉండకపోవచ్చు. కానీ ఇతర బహుళజాతి కంపెనీలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనేది ప్రశ్నార్థకంగా మారింది. బెంగళూరు, చెన్నై, పుణె, హైదరాబాద్‌లోని అవుట్‌సోర్సింగ్ హబ్‌లు ఇప్పటికే ఎఐ నుండి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. చాలా వరకు ఐటి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఉద్యోగులకు శిక్షణ కూడా ఇస్తున్నాయి. రానున్న రోజుల్లో దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, క్రౌడ్ స్ట్రైక్, ఐబిఎం వంటి పెద్ద కంపెనీలు సుమారు 70,000 మంది ఉద్యోగులను తొలగించారు. మైక్రోసాఫ్ట్ లాభదాయకతను పెంచుకోవడం, ఎఐ, డేటా సెంటర్లలో భారీ పెట్టుబడుల కోసం ఉద్యోగులను తొలగిస్తోంది. ఐబిఎం హెచ్‌ఆర్ కార్యకలాపాలలో ఎఐ వ్యవస్థలను విస్తృతంగా ప్రవేశపెట్టి 8 వేల మంది ఉద్యోగులను తగ్గించింది. అమెరికా టెక్ దిగ్గజాలు భారతదేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సేల్స్, సపోర్ట్ వంటి విభాగాల్లో భారతీయ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ లేఆఫ్‌లు భారతీయ ఉద్యోగులపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతాయి. ఐటి రంగంలో ఇప్పుడు ఆటోమేషన్, ఎఐ టెక్నాలజీలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టెక్నాలజీల పుణ్యమా అని పునరావృత పనుల్లో ఉద్యోగుల అవసరం లేకుండాపోతోంది. మిగతా పనుల్లోనూ ఐటి కంపెనీలు ఎఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. అందుకోసం ఉన్న ఉద్యోగులకే కొత్త డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వినియోగించుకుం టున్నాయి. ఆ టెక్నాలజీలపై పట్టు సాధించలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఐటి ఉద్యోగులకు ఎఐ ఒక పెద్ద సవాలుగా మారింది. పొదుపు చర్యలు, పెరుగుతున్న నైపుణ్య అవసరాలు, ఆటోమేషన్, ఎఐ అడాప్టేషన్ ఒత్తిళ్లతో ఉద్యోగ ప్రపంచం తలకిందులవుతోంది. ఉద్యోగం ఉంటుందా, ఊడు తుందా అనే టెన్షన్‌తో టెకీలు ఆందోళన చెందుతున్నారు. ఇఎంఐలు ఎలా కట్టాలి? మరో ఉద్యోగం ఎప్పుడు వస్తుంది అనే ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. కంపెనీలు వ్యయం తగ్గింపు, నష్టాల నియంత్రణ వంటి కారణాలకు బదులు, ఇప్పుడు సంస్థ పునర్నిర్మాణం, పురోగతి, వర్క్‌ఫోర్స్ ఆప్టిమైజేషన్ వంటి పదాలను ఉపయోగిస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కమ్యూనికేషన్లు, పాడ్‌కాస్టింగ్, పరికరాలు, హెచ్‌ఆర్, సర్వీస్ డిపార్ట్‌మెంట్‌లలో కోతలు ఎక్కువగా ఉన్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత ఐటి రంగంలో సైలెంట్ లేఆఫ్‌లు ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్నాయి. ఎఐ సాంకేతికతతో ఇంజనీరింగ్ పనులను ఆటోమేట్ చేయడం, వ్యయ తగ్గింపు చర్యలు, వ్యాపార వృద్ధిలో మందగమనం వంటివి దీనికి కారణాలు. కంపెనీలు సామూహిక లేఆఫ్‌లను ప్రకటిస్తే మార్కెట్లో చెడు సంకేతం వెళ్తుందని భావించి, ఉద్యోగులే స్వచ్ఛందంగా రాజీనామా చేసేలా ఒత్తిడి చేసే పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఎఐ వల్ల ఉద్యోగాలు పోతాయని 67.5 శాతంమంది ఇంజినీర్లలో ఆందోళన నెలకొన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. నైపుణ్యాల్ని పెంచుకోకపోతే కెరీర్‌కు రక్షణ ఉండదని 87.5 శాతం మంది అభిప్రాయపడ్డారు. వచ్చే పదేళ్లలో 40 శాతం వరకు జాబ్స్ ఎఐ పరిధిలోకి వెళ్లే అవకాశం ఉందని, దీంతో 89 శాతం మేర ఇంజినీర్లు ఎఐ, ఎంఎల్‌లోనే కొత్త నైపుణ్యాల్ని నేర్చుకోవాలనుకుంటున్నారని ఆ అధ్యయంలో పేర్కొంది. ఎఐ విప్లవంపై మరో వాదన కూడా ఉంది. ఎఐ అభివృద్ధి వల్ల ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఒకవైపు చర్చ జరుగుతుంటే, అనేక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి ఉద్యోగాలను తొలగిస్తూ, దానికి ఎఐ ని కారణంగా చూపుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఎఐ సాధనాలు ఇప్పటివరకు కొన్ని రంగాల్లో మాత్రమే ప్రభావవంతంగా ఉన్నాయని, వేలాది మంది ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేసే స్థాయికి ఇంకా చేరలేదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ఎఐ సునామీని ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది, భారతీయ ఉద్యోగ మార్కెట్ ఈ మార్పులకు అనుగుణంగా మారాల్సి ఉంటుంది.

# మేటి గాయకుడు రఫీ



ప్రముఖ ఉత్తర భారత నేపథ్యగాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటుదేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్యగాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం. జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ - జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ పీ నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ - ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్ని యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 - స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయబడింది. 1967 - భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయ బడింది. 2001 - హీరో హొండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 - సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు. "చౌధవీం కా చాంద్ హెూ , తేరి "ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", "బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ, ఎన్టీఆర్ 'ఆరాధన'లో నా మది నిన్ను పిలిచింది గానమై.. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన సిపాయి పాట నేటికీ తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచిపోయారు.

# కైలాసపురిలో పత్రీజీ ధ్యానమహాయాగం





### మాజీ సీబీఐ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ కార్తికేయన్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కైలాసపురిలోని పత్రీజీ శక్తి స్థల్ లో విజయవంతంగా జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగంలో మూడో రోజు పండిత్ సంజయ్ సింగ్ బృందం అద్భుతంగా సంగీత నాధ ధ్యానం నిర్వహించారు. ఈ సంగీత నాద ధ్యానంలో పెద్ద ఎత్తున పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొని మూడు గంటల పాటు ఎంతో శ్రద్ధగా ధ్యానం చేసి ఆనందంతో నృత్యం చేసారు. ఈ కార్యక్రమంలో సినీ ఫైటర్స్ రామ్ లక్ష్మణ్ లు కూడా పాల్గొని ధ్యానులతో కలిసి డ్యాన్స్ చేసి సందడి చేసారు.రంగారెడ్డి జిల్లా కైలాసపురిలోని పత్రీజీ శక్తి స్థల్ లో పత్రీజీ ధ్యానమహాయాగం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మూడో రోజు ప్రదర్శించిన పీఎస్ఎస్ఎం ఏవీలు అందరినీ ఆకట్టుకున్నాయ.ఈ సందర్బంగా చిత్తూరు జిల్లా దామరకుప్పం గ్రామంలో గల శ్రీ గోవింద పిరమిడ్ వ్యాలీ ధ్యాన బృందావనం ఏవీ ని ప్రదర్శించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు పిరమిడ్ స్థాపన, పిరమిడ్ లో చేసిన కార్యక్రమాలు, భవిష్యత్తులో తాము చేయబోయే ధ్యాన ప్రచారం గురించి తెలియజేసారు. అనంతరం పిరమిడ్ ఆఫ్ ఇండియా ఏవీని ప్రదర్శించగా పార్టీ కమిటీసభ్యులు పిరమిడ్ పార్టీ గురించి వివరించారు. పిరమిడ్ పార్టీ విస్తరణకు చేసిన కృషిని, పిరమిడ్ పార్టీ లక్ష్యాల గురించి తెలియజేసారు. అనంతరం అక్షయ పాత్ర అన్నదానం ట్రస్ట్ ఏవీ, అలాగే పిరమిడ్ స్పిరిచ్యువల్ సైన్స్ అకాడమీ ఏవీని ప్రదర్శించగా ట్రస్ట్ సభ్యులు తాము చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే శ్రీనవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం ఏవీని ప్రదర్శించగా ట్రస్ట్ సభ్యులు, ఈ పిరమిడ్ ను ఎప్పుడు స్థాపించింది, ధ్యాన ప్రచారానికి తాము చేస్తున్న కార్యక్రమాలు, అలాగే భవిష్యత్తులో చేయబోయే పనుల గురించి తెలియజేసారు.రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కైలాసపురిలోని మహేశ్వర మహాపిరమిడ్ లో ఘనంగా జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-4 లో బ్రహ్మర్షి పితామహ పత్రీజీ జీవిత చరిత్రపై రూపొందించిన పత్రీజీ ఫిలిమ్ ట్రైలర్ ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. ఈ ట్రైలర్ లో బ్రహ్మర్షి పత్రీజీ విజువల్స్ చూసి ధ్యానులు మధురానుభూతులకు లోనవుతున్నారు. ట్రైలర్ అద్భుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఈ ఫిలిమ్ కు పిరమిడ్ మాస్టర్ వెంకట్ దర్శకత్వం వహించారు. తాను పొందిన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరికీ పంచాలని జీవితాంతం కృషి చేసిన గొప్ప వ్యక్తి బ్రహ్మర్షి పత్రీజీ అని కొనియాడారు మాజీ సీబీఐ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ కార్తికేయన్. ధ్యానాన్ని అందరికీ అతి సులువైన మార్గంలో అందించారన్నారు. తన చివరి శ్వాస వరకు ధ్యాన జగత్ కోసం కృషి చేసారని ప్రశంసించారు. బ్రహ్మర్షి పత్రీజీ అందరినీ ఎంతగానో ప్రేమించేవారని, స్వయంగా వంట చేసి అందరికీ వడ్డించేవారని అలాంటి గురువును ఎనాడైనా చూసామా అని ప్రశ్నించారు. మహేశ్వర మహాపిరమిడ్ ను అద్భుతంగా తీర్చిదిద్దారని, రాబోవు రోజులో ఈ పిరమిడ్ టూరిజం స్పాట్ గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రతి పిరమిడ్ మాస్టర్ బాగా కష్టపడి మొత్తం మానవాళికి ధ్యానాన్ని అందించాలని సూచించారు.రంగారెడ్డి జిల్లా కైలాసపురిలోని మహేశ్వర మహా పిరమిడ్ లో ఘనంగా జరుగుతున్న ప్రతీజీ ధ్యాన మహాయాగంలో ప్యానెల్ డిస్కషన్ కార్యక్రమంలో ధ్యానం, జ్ఞానానికి సంబంధించిన పలు అంశాలపై చక్కటి చర్చ జరుగుతోంది. పత్రీజీ ధ్యాన మహాయాగంలో మూడో రోజు నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్ లో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు కిశోర్, 108 శ్రీనివాసరావు, పిరమిడ్ చారీ, సురేష్, పిరమిడ్ విజయ్ లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా తాము ఎప్పుడు ధ్యాన మార్గంలోకి వచ్చింది. ఎన్ని పిరమిడ్ లను నిర్మించింది. ఎందుకు పిరమిడ్ లు మూడింతలు శక్తివంతం అనే దానిపై చక్కగా వివరించారు. పిరమిడ్ అనే పదం ఎంతో ఎనర్జీతో కూడకున్నదని తెలిపారు.పిరమిడ్ అనేది ప్రపంచంలో సెంటర్ పాయింట్ లో ఉంటుందని, మూడింతల శక్తివంతమైనవని, ఇది సైన్స్ పరంగా కూడా రుజువైందని తెలియజేసారు.పత్రీజీ ధ్యాన మహాయాగంలో బ్రహ్మర్షి పత్రీజీ కూతురు పరిణిత పత్రీ అందిస్తున్న సందేశాలు ధ్యానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో మూడో రోజు పరిణిత పత్రీ అహింసా అనే అంశం గురించి చక్కగా వివరించారు. హింసించబడ్డ ఏది కూడా తినకూడదని సూచించారు. సాత్విక ఆహారమే తిసుకోవా లన్నారు. అహింసా అనేది ఆహారంలోనే కాకుండా మన అలోచనలు, మాటల్లో కూడా ఉండాలని తెలిపారు. ఎవరినీ కూడా దూషించకూడదని, విమర్శలు చేయకూడదన్నారు. మనసా, వాచా, కర్మణా అహింసా పాటించాలని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

## రైతే దేశ ఆర్థిక వెన్నెముక

**గంగవరం రామకృషారెడ్డి**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:**డిసెంబర్ 23న నేషనల్ ఫార్మర్స్ డే సందర్బంగా దేశానికి అన్నం పెట్టే రైతుకు ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృషారెడ్డి తెలిపారు.భూమిని తల్లిగా భావించి, విత్తనం విత్తి చెమటతో పంట పండించే రైతే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని అన్నారు. రైతుల సంక్షేమమే దేశ అభివృద్ధి అనే నమ్మకంతో తన జీవితాన్ని అంకితం చేసిన మాజీ ప్రధాని చౌధరి చరణ్ సింగ్ గారి జన్మదినాన్ని కిసాన్ దివస్‌గా జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.నేటి రైతు సాగు ఖర్చులు, గిట్టుబాటు ధరల లేమి, నీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాడని, వీటికి శాశ్వత పరిష్కారాలు అవసరమని అన్నారు. రైతు బాగుంటే గ్రామం బాగుంటుందని, గ్రామం బాగుంటే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.అన్నదాతకు వందనం, రైతన్నకు జై అంటూ నేషనల్ ఫార్మర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## కారును బైకు ఢీ

**ముందెలుతున్న కారును ఢీ కొట్టిన బైక్ పై వెళ్తున్న వాహనదారుడు**



**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం** చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్ద దగడ గ్రామ సమీపంలో వెలుగొండ గ్రామానికి చెందిన శ్రీకాంత్ (28) అనే వ్యక్తి ముందు వెళ్తున్న కారును వెనక నుండి బైకుతో ఢీకొన్న ఘటనలో బైక్ పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటన స్థలాన్ని కి చేరుకొని గాయపడిన వ్యక్తిని హుటాహుటిన వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి నరేందర్ పైలెట్ రాఘవేందర్ తెలియజేశారు.

## క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి తాను నిరంతరం కట్టుబడి ఉంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే క్రిస్మస్ వేడుకల నిర్వహణకు రెండు లక్షల రూపాయలు కేటాయించిందని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలోని చర్చిలకు 30 వేల రూపాయల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ ఆయా నిధులను బ్యాంకు ఖాతాల ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని చర్చిల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. చర్చిల అభివృద్ధికి అవసరమైన పనులపై నిర్వాహకులు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే రెండు ఎకరాల స్థలంలో క్రైస్తవ సంఘ భవన నిర్మాణంతో పాటు గ్రేవ్ యార్డ్ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారి అఫ్జలుద్దిన్, ఉప కలెక్టర్ శ్రావ్య, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, క్రైస్తవ సంఘ ప్రతినిధులు బెంజిమెన్, జానప్ప జాన్, రాజు, గోర్ల అనిల్, గంధం బాలరాజు, వేణు, శ్రీకాంత్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# కళ్లకు గంతలు కట్టినా గణితానికి గంతలే లేవు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి పట్టణంలోని మాస్టర్ మైండ్ హై స్కూల్‌లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కళ్లకు గంతలతో గణిత అవధానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ అనంతప్ప యాదవ్ పాల్గొని విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించే పలు మెలకువలను వివరించారు. మెమరీ శతావదానంలో భాగంగా 1 నుంచి 100 వరకు అంకెలను వివిధ పేర్లతో అనుసంధానించి కళ్లకు గంతలు కట్టుకొని ఆరోహణ, అవరోహణ క్రమాల్లో అంకెలను వివరించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. అలాగే మాయ కూడిక విధానంతో గణితాన్ని సులభంగా నేర్చుకునే పద్ధతులను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. గౌతమ్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పాత్రికేయుని పరామర్శించిన నాయకులు



**అగ్నిధార న్యూస్ కమన్పూర్** కమాన్పూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బండ సాయిశంకర్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా కరీంనగర్ లోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం సాయి శంకర్ కాలుకు శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రిలో సాయి శంకర్ ను ఇనగంటి భాస్కర్ రావు, ఇనగంటి రామారావు, ముస్త్యాల దామోదర్. ఇనగంటి శ్రవణ్ కుమార్, విలేకర్లు గాదె బాలు, మల్యాల సురేష్ లు పరామర్శించారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతున్ని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన అండేకార్ శంకర్ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ సర్పంచ్ సిద్దగో ని ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3,000 వేల రూపాయలు మరియు గ్రామ సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడ్ 2000 వేల రూపాయలు మొత్తం 5000 అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ గణేష్, కొప్పు కృష్ణయ్య, ఆర్కేగౌడ్, పరమేష్ గౌడ్, ఎల్ఐసి వెంకటయ్య, జహంగీర్, రవి, రమేష్, మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు


## నూతన సర్పంచ్ ని సన్మానించిన రాష్ట్రా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణరెడ్డి,మరియు గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల సహకారంతో గెలుపొందిన,సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య గౌడ్ ఉప సర్పంచ్ లలిత మల్లయ్య, వార్డు సభ్యులు సురేష్, పద్మమ్మ పోతురాజు, రామాంజనేయుల,సువర్ణ అంజయ్య, బాధ్యతలు తీసుకున్న సందర్భంగా హైదరాబాద్ లోని బీ ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలుపుతూ,సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పై ప్రభుత్వం నీ నిలదీయాలి

**నాగిళ్ల సర్పంచ్ ని సన్మానించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ గా గెలిచినా పాలకూర్ల సంతోష రాజు గౌడ్ తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించి సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ చెన్నయ్య,తది తరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

**సర్పంచ్ ను సన్మానించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో నూతనంగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీ ఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ కట్ట జేయమ్మ యాదయ్య గెలుపొందడం జరిగింది .తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ నీ హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని అభినందించి సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ రెడ్డి మాలతి కృష్ణ రెడ్డి గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ పార్టీ రాష్ట నాయకుడు నాగులు నాయక్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం నారాయణ పూర్ గ్రామానికి చెందిన నేనావత్ జిజా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నాగులు నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి 3000 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజి నాయక్, ధర్మ,హర్యా నాయక్, పాండు, గోపి,మధు,సంతోష్,భాస్కర్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఈప్రాంత కార్యాలయాలను మాజీ ఎమ్మెల్యే తరలించారు

**ఆరు కొట్ల రూపాయలతో రోడ్ల ఆధునికరణ.**
**సెంట్రల్ లైటింగ్ ఐలాండ్స్ తో సుందరంగా తీర్చిదిద్దాం.**
**9 సంవత్సరాల బి ఆర్ఎస్ పాలనలో మండలం అభివృద్ధికి దూరం.**



**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్ రూరల్** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి తహసిల్దార్ కార్యాలయం మీదుగా గట్టేపల్లి చౌరస్తా వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు సెంటర్ లైటింగ్ రెండు చోట్ల ఐలాండ్స్ నిర్మాణం చేపట్టి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిధులు వెచ్చించినట్లు తెలిపారు. నూతనంగా నిర్మాణం చేపడుతున్న రోడ్డును స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ...రెండు చోట్ల అంబేద్కర్ కూడలి, ఎంపీడీవో కార్యాలయ కూడలి లా వద్ద 50 లక్షలతో ఐలాండ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముందుగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టి దశలవారీగా డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేపడుతామని అనంతరం ఐలాండ్స్ ఏర్పాటు. చేపడతామని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సుల్తానాబాద్ మండలంపై సవతి తల్లి ప్రేమను చూపారని ఇక్కడ అభివృద్ధిని విమర్శించి గతంలో పాత తాలూకా గా ఉన్న ఈ ప్రాంతంలో నీ కార్యాలయాలను సైతం తరలించుకు పోయారని పోస్టుమార్టం తో పాటు అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుంద రెడ్డి ఈ ప్రాంతంలో పాత తాలూకా గా గుర్తించి 1989- 90 లో రెండు ఎకరాల స్థలం కేటాయించి ఐసిడిఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే దానిని తరలించకపోవడం సిగ్గుచేటు అన్నారు. స్థానిక ఐబి కార్యాలయంలో ఆర్ అండ్ బి డి ఈ ఆఫీస్ విద్యార్థుల డిస్టెన్స్ సర్టిఫికెట్ కోసం ఏర్పాటు చేస్తే దానిని తరలించారని అన్నారు. ఇలా మండలంలో అనుకూలం గా ఉన్న అన్ని కార్యాలయాలను తరలించాలని పేర్కొన్నారు. ఐబి ఇరిగేషన్ త్రాగునీటి ఆర్డబ్ల్యూఎస్ సెక్షన్ కార్యాలయం నిర్వీర్యం చేశారని అన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న గిట్ల ముకుంద రెడ్డి, బిరుదు రాజమల్లు ఈ ప్రాంతంపై అమితమైన ప్రేమను చూపి కార్యాలయాలను తీసుకువచ్చి ఏర్పాటు చేస్తే దాసరి మనోహర్ రెడ్డి వాటిని తరలించుకు పోయారని అన్నారు. రానున్న రోజుల్లో సుల్తానాబాద్ పట్టణాన్ని అతి సుందరంగా తీర్చిదిద్దుతామని గతంలో పాత జెండా చౌరస్తా నుండి సిసి రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని మిగిలి ఉన్న పోలీస్ స్టేషన్ ఏరియా గజ బీన్ కార్ జగన్, హజారుద్దీన్ ఆస్పటల్ ఏరియా వడ్డెర కాలని, మేరావాడ, తదితర కాలనీలలో రోడ్లను పూర్తి చేపడతామని అలాగే పాత రహదారి సుద్దాల, రేగడి మదిగుంట, మియాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డున సైతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. దాదాపు సంవత్సరం కాలంలో ఈ రోడ్లన్నీ పూర్తిచేస్తే సుల్తానాబాద్ 90% అభివృద్ధి పూర్తయితుందని పేర్కొన్నారు. 14 నుండి 15 కోట్ల రూపాయలతో అమృత 2.0 లో పెద్ద వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి పైప్లైన్ల పనులు చేస్తున్నామని త్వరలోనే త్రాగునీటి సమస్యను సైతం పూర్తిగా తొలగించేందుకు కృషి చేస్తామని అన్నారు. హైదరాబాద్ రోడ్లను తలపించే విధంగా సుల్తానాబాద్ మండల కేంద్రంలో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదని నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం చేపట్టి సుల్తానాబాద్ ను సుందరంగా తీర్చిదిదెందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో ఇండ్లు కోల్పోయి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, శ్రీగిరి శ్రీనివాస్, గాజుల రాజమల్లు, సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, బిరుదు కృష్?, పన్నాల రాములు, అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, వస్తే ఎం గణేష్, మహమ్మద్ రఫీక్, దున్నపోతుల రాజయ్య, గాదాసు రవీందర్, పీకే ప్రభాకర్, ఫరూక్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ పాల్గొన్నారు.

## రవీంద్ర జడేజా కీలక నిర్ణయం



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ-2025లో భాగమయ్యేం దుకు సిద్ధమయ్యాడు. సొంత జట్టు సౌరాష్ట్ర తరపున జడ్డూ రెండు మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఈ విషయాన్ని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధికారి ఒకరు ధ్రువీకరించారు. కర్ణాటకలోని ఆలూర్‌లో జనవరి 6, 8న జరిగే మ్యాచ్‌లలో సౌరాష్ట్ర జట్టుకు జడేజా ప్రాతినిథ్యం వహిస్తాదని టైమ్స్ ఆఫ్ ఇండియాతో పేర్కొన్నాడు. కాగా టీ20 ప్రపంచకప్-2024లో టీమిండియా చాంపియన్‌గా నిలిచిన తర్వాత రవీంద్ర జడేజా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

**ఆసీస్ టూర్‌కు ఎంపిక చేయలేదు**

ఈ క్రమంలో ప్రస్తుతం వన్డే, టెస్టుల్లో కొనసాగుతున్న జడ్డూను.. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన నుంచి సెలక్టర్లు తప్పించారు. వన్డే జట్టులో అతడికి స్థానం కల్పించలేదు. దీంతో వన్డే వరల్డ్‌కప్-2027 ప్రణాళికల్లో జడ్డూ లేడా అన్న సందేహాలు నెలకొన్నాయి. ఈ విషయంపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నాడు స్పందిస్తూ.. “మా ప్రణాళికల్లో అతడు భాగమే. చాంపియన్స్ ట్రోఫీ జట్టులోనూ అతడు ఉన్నాడు. నాడు పిచ్ పరిస్థితులకు అనుగుణంగా అదనపు స్పిన్నర్లకు జట్టులో చోటిచ్చాం. అయితే, ఆసీస్‌టూర్‌లో జట్టు సమతూకంగా ఉండేలా చూసుకోవాలి. కాబట్టి వాషీ, కుల్దీప్‌లతో మేము ముందుకు వెళ్తున్నాం. ఒక్కోసారి ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ ఉన్నపుడు ఇలాంటి నిర్ణయాలు తప్పవు. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో పిచ్ పరిస్థితులకు తగ్గట్లే జట్టును ఎంపిక చేశాము” అని జడ్డూను తప్పించడానికి గల కారణాన్ని వెల్లడించాడు.

**సఫారీలతో సిరీస్‌లో సత్తా చాటిన జడ్డూ**

అయితే, ఈ టూర్ తర్వాత స్వదేశంలో ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌కు జడేజాను ఆడించింది యాజమాన్యం. తొలి వన్డేలో 20 బంతుల్లోనే 32 పరుగులు చేసిన జడ్డూ.. రెండో వన్డేలో 24 పరుగులతో అజేయంగా నిలిచాడు. అయితే, ఈ సిరీస్‌లో ఈ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్.. కేవలం ఒకే ఒక్క వికెట్ తీయగలిగాడు. కాగా టీమిండియా తరపున విధుల్లో లేని సమయంలో ఆటగాళ్లంతా దేశీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఇటీవలే కచ్చితమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. గాయం, ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నవాళ్లకు మాత్రమే ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కూడా తమ జట్లు ముంబై, ఢిల్లీ తరఫున బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. ఇక కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శుబ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మ తదితరులు కూడా తమ జట్ల తరపున ఆడేందుకు సిద్ధం కాగా.. తాజాగా జడ్డూ కూడా ఈ జాబితాలో చేరిపోయాడు. కాగా లిస్-ఎ క్రికెట్‌లో లెఫ్టాండర్ జడేజా 260 మ్యాచ్‌లు ఆడి.. 3911 పరుగులు చేయడంతో పాటు 293 వికెట్లు కూడా పడగొట్టాడు. కాగా విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొన్న తర్వాత.. టీమిండియా స్టార్లు.. న్యూజిలాండ్‌తో సిరీస్‌తో బిజీ అవుతారు.

# టీఆర్ఎస్‌డీ పార్టీలో చేరికలు

**పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ గౌడ్**



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ (టీఆర్ఎస్‌డీ) పార్టీలో మహిళల భారీ చేరికలు జరిగాయి. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి స్వరూప ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ పరిధికి చెందిన సుమారు 50 మంది మహిళలు పార్టీ విధి విధానాలపై నమ్మకంతో స్వఛరేదంగా టీఆర్ఎస్‌డీ పార్టీలో చేరారు. కార్పొరేషన్ పార్టీ అధ్యక్షులు నీలం బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదునూరి నర్సింగ్ హాజరయ్యారు. పార్టీలో చేరిన మహిళలకు వారు సాదరంగా స్వాగతం పలికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందరరేగా శంకర్ గౌడ్, నర్సింగ్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీపై విశ్వాసంతో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ నాయకత్వంలో త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో పోటీ చేసే మహిళలకు పార్టీ పరంగా పెద్దపీట వేస్తామని తెలిపారు. అలాగే నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాదాసి లక్ష్మి, ముత్తునూరి రాజమ్మ, పల్లె మంజుల, సమ్మెట రాణి, దుబ్బాక వనజ, కోట ఉమాదేవి, పారిపెల్లి లక్ష్మి, దేవసాని స్రవంతి, ముత్తునూరి భారతమ్మ, కోట స్వరూప, గంధం రాధమ్మలతో పాటు పార్టీ నాయకులు బాలసాని కొమురయ్య, ఆవునూరి కుమార్, బాలసాని సరోజన తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సోమశిల బ్యాక్ వాటర్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు విహారం

**తీరిక దొరికింది తీరం పిలిచింది**

**పకృతితో మంత్రి ముచ్చట కుటుంబంతో సంతోషం**

**కుటుంబ సమేతంగా సోమశిల కృష్ణ నది తీరంలో సందడి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు**



**అగ్నిదార న్యూస్ కొల్లాపూర్.** నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ కేంద్రంలోని సోమశిల గ్రామంలో నిత్యం అధికారిక పర్యటనలు అభివృద్ధి సమీక్షలు రాజకీయ కార్యకలాపాలతో తీరిక లేకుండా గడిపే పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వల్ప విరామం తీసుకున్నారు పదవీ బాధ్యతల ఒత్తిడిని పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో కలిసి సోమశిల కృష్ణమ్మ ఒడిలో హాయిగా సంతోషాన్ని గడిపారు నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన సోమశిల వృద్ధా కృష్ణా నది బ్యాక్ క్వాటర్ లో ఆయన జలవిహారం చేశారు. ఉదయం కుటుంబ సమేతంగా సోమశిల చేరుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు బోటులో ప్రయాణిస్తూ ప్రకృతి సౌందర్యాన్ని తిలకించాడు. తన తోబుట్టువులు మనవరాలు ఇతర కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తూ సేద తీరారు సోమశిల బ్యాక్ వాటర్ లో పర్యాటించిన మంత్రి ఈసారి కేవలం ప్రయాణికుడిగా పరిమితం కాలేదు పర్యాటక శాఖ మంత్రి హోదాలో కాకుండా ఒక సాహస యాత్రికుడిగా మారి స్వయంగా బోర్డర్ స్టీరింగ్ కృష్ణ జనాలపై వివారించారు జలవిహారంలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు కాసేపు గాలం పట్టి చేపలు పట్టారు ఎంతో చిక్కినపుడు ఆయన ముఖంలో కనిపించిన చిరునవ్వు ఒక సామాన్య పర్యాటకు ని సంతోషాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ఉల్లి పంటపై శిక్షణ కార్యక్రమం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో




**అగ్నిధారన్యూస్ “(సంగారెడ్డి)”** సంగారెడ్డి జిల్లా మనూరు మండల్ తుమ్మన్నూర్ గ్రామం రైతు వేదికలో ఉద్యాన శాఖ వారి ఆధ్వర్యంలో ఉల్లి పంట పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ నిర్మల డాక్టర్ కే అరుణ విచ్చేశారు. ఈ సంవత్సరం సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా ఉల్లి సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు ఉద్యాన శాఖ వారు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్యంగా ఉల్లి లో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు, విత్తన శుద్ధి, పంట అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పంట నిల్వ ఉండడానికి పిచికారి చేసే రసాయనాల గురించి రైతులకు సూక్ష్మంగా వివరించారు. ఇదే కాకుండా ఉల్లి వేసిన పొలాలను సందర్శించి రసం పీల్చే పురుగులు నివారించడానికి వేప నూనె ,జిగురు అట్టలను రైతులకు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఉల్లి సాగు చేస్తున్న రైతులు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సంగారెడ్డి జిల్లా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారిని కే మౌనిక రెడ్డి, హెచ్ ఈ ఓ శ్రీకాంత్ రెడ్డి ,కె విటల్, తుమ్మూరు సర్పంచ్ సంజీవులు తదితరులు హాజరైనారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్**



కల్వకుర్తి మండలంలోని గుండూర్ గ్రామానికి చెందిన పోతరపల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులుమిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలు కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, బిఆర్ఎస్ నాయకులు నాగేంద్రం, కృష్ణయ్య ,భగవంతు,కిరణ్, పరశురాములు,రమేష్ , సదాశివుడు,బంగారి,జగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరసన తెలిపిన సింగరేణి కార్మికుల



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ డిసెంబర్: 23** సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం డిసెంబర్ 23 తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించే వేడుకలను నిలిపేయడం తో సింగరేణి అధికారులు ఆర్ జీవన్ పరిధి లో సింగరేణి జిఎం ఆఫీస్ నందు నామ మాత్రంగా వేడుకలను నిర్వహించారు దీనికి వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు ఆర్ జీవన్ పరిధి లో అన్ని గనుల పైన కార్మికులు విధులు బైక్వాడ్ చేసి నల్ల బ్యాడ్జీలు తో నిరసన తెలిపారు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులకు ఎఐటియుసి గుర్తింపు సంఘం తరుపున కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు

## ఉల్లి పంటపై శిక్షణ కార్యక్రమం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో




**అగ్నిధారన్యూస్ “(సంగారెడ్డి)”** సంగారెడ్డి జిల్లా మనూరు మండల్ తుమ్మన్నూర్ గ్రామం రైతు వేదికలో ఉద్యాన శాఖ వారి ఆధ్వర్యంలో ఉల్లి పంట పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ నిర్మల డాక్టర్ కే అరుణ విచ్చేశారు. ఈ సంవత్సరం సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా ఉల్లి సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు ఉద్యాన శాఖ వారు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్యంగా ఉల్లి లో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు, విత్తన శుద్ధి, పంట అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పంట నిల్వ ఉండడానికి పిచికారి చేసే రసాయనాల గురించి రైతులకు సూక్ష్మంగా వివరించారు. ఇదే కాకుండా ఉల్లి వేసిన పొలాలను సందర్శించి రసం పీల్చే పురుగులు నివారించడానికి వేప నూనె ,జిగురు అట్టలను రైతులకు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఉల్లి సాగు చేస్తున్న రైతులు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సంగారెడ్డి జిల్లా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారిని కే మౌనిక రెడ్డి, హెచ్ ఈ ఓ శ్రీకాంత్ రెడ్డి ,కె విటల్, తుమ్మూరు సర్పంచ్ సంజీవులు తదితరులు హాజరైనారు.

## వడ్డీ రేటు 7.15 శాతానికి తగ్గిస్తూ ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ నిర్ణయం

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గృహ రుణ గ్రహీ తలకు శుభవార్తను అందిం చింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లను 7.15 శాతానికి తగ్గిస్తు న్నట్లు ప్రకటించింది. ఇటీవల ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందిస్తోంది. ఈ తగ్గింపు నిర్ణయం నేటి నుంచి అమలులోకి వస్తుందని సంస్థ తెలిపింది. ఈ మేరకు ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఎండీ అండ్ సీఈవో త్రిభువన్ అధికారి మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఆర్బీఐ 125 బేసిస్ పాయింట్ల రెపో రేటును తగ్గించిందని తెలిపారు. ఇది గృహ రుణాలు తీసుకునే వారికి కొంత భారం తగ్గిస్తుందని ఆయన అన్నారు. 2026లోకి అడుగుపెట్టనున్న ఈ సమయంలో వడ్డీ రేట్ల తగ్గింపు గృహ రుణాల డిమాండ్‌కు ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్బీఐ ఇటీవల రెపో రేటు తగ్గించిన తరువాత పలు బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ క్రమంలో ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ కూడా రుణ గ్రహీతలకు ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

## న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

అమెరికాతో ఆలస్యమవుతున్నా, పలు దేశాలతో వరుసపెట్టి వాణిజ్య ఒప్పందాలను మనదేశం కుదుర్చుకుంటోంది. జులైలో బ్రిటన్, ఈ నెల మొదట్లో ఒమన్‌తో సంతకాలు చేయగా, తాజాగా న్యూజిలాండ్‌తో ఒప్పంద సంప్రదింపులను మనదేశం పూర్తి చేసింది. భారత, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) సంబంధించిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ప్రకటించారు. 2026 ప్రథమార్థంలో సంతకాలు జరగనున్న ఈ ఎఫ్‌టీఏ కింద వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 20 బి. డాలర్ల (సుమారు రూ.1.8 లక్షల కోట్ల) పెట్టుబడులను న్యూజిలాండ్ పెట్టనుంది. ఇరుదేశాల మధ్య వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యం 2024లో2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21,600 కోట్ల) మేర జరిగింది. ఇందులో వస్తువుల వాటా 1.3 బి.డా. (సుమారు రూ.11,700 కోట్లు). ఎఫ్‌టీఏ కుదిరాక, అయిదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపై 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.45,000 కోట్ల)కు చేరే అవకాశం ఉంది.

# మూడవ రోజు కొనసాగుతున్న ఐక్యత ఉచిత కంటి వైద్య సేవలు





**గ్రామాల నుంచి అపూర్వ స్పందన**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సి ఓ ఓ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి మాడ్గుల మండల ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తుంది,ఉచిత కంటి వైద్య శిబిరానికి 700 మందికి పైగా రావడంతో 464 మందికి ఉచిత కంటి పరీక్షల చేశారు,280 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ చేశారు,ఐక్యత ఫౌండేషన్ మాడ్గుల మండల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి మాట్లాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఐక్యత ఫౌండేషన్ ద్వారా సుంకిరెడ్డి ఆరోగ్య భరోసా కార్యక్రమంలో బాగంగా గ్రామాల్లో ఉచిత హెల్త్ క్యాంప్ లు మరియు మండలాల వారిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నారని,ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనే గ్రామీణ ప్రాంతాల్లో కంటి శిభిరం యొక్క అవశ్యకత తెలియజేస్తుంది,ఇలాంటి సేవా కార్యక్రమాలు ఐక్యత ఫౌండేషన్ ద్వారా నిరంతరం కొనసాగుతాయని,మూడు రోజులుగా ఈ శిబిరాన్ని 1450 మందికి పైగా సందర్శించగా, 980 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా, 640 మందికి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేయగా,39 మంది పేషెంట్లను కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ మాడ్గుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు యాదయ్య శ్రీపతి, శేఖర్, శ్రీను, నాగిళ్ళ శివ, ఎరుకలి శివ తదితరులు ఉన్నారు.

# అసెంబ్లీ సమావేశాల వేదికగా ఫైట్



**హైదరాబాద్ :** ఇటీవల తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ప్రెస్ మీట్ తరువాత రాష్ట్ర రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. రెండేళ్లు గడువు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులలో చిన్న పనులు చేయలేదని, తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ఆరోపణలు, విమర్శలకు అసెంబ్లీలోనే సమాధానం చెబుతామని, జనవరి 2 నుంచి జలాల అంశంపై అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై సమగ్రంగా చర్చించేందుకు డిసెంబర్ 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నారు. మంత్రులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్టుల నీటి కేటాయింపులు, రాష్ట్ర విభజన 2014 తర్వాత జరిగిన వ్యయం వంటి అంశాలపై అసెంబ్లీ వేదికగా 'నీళ్లు–నిజాలు' పేరుతో చర్చించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేసీఆర్ విమర్శలు చేసిన పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, అప్పట్లోనే డీపీఆర్‌లు ఎందుకు వెనక్కి వచ్చాయన్నది ప్రజలకు వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ 29న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించి, 3 రోజుల విరామం తర్వాత జనవరి 2 నుంచి సమావేశాలు తిరిగి కొనసాగించాలని సీఎం రేవంత్ యోచిస్తున్నారు. హైదరాబాద్ నగర విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిని పెంచుతూ, నగరాన్ని 3 నగరపాలక సంస్థలుగా విభజించే ప్రతిపాదనపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. కొత్తగా 70 నుంచి 80 డివిజన్లతో అదనపు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని, అందులో ఒకటి సైబరాబాద్ పేరుతో ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం ఉంది. ఓటర్ల జాబితా సవరణ పూర్తయిన తర్వాత వచ్చే జనవరి తరువాతే రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అంశంపై చర్చించారు. ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు మంత్రులను రేవంత్ రెడ్డి అభినందించారు. గెలిచిన సర్పంచుల విద్యార్హతలు, సామాజిక వర్గాల వారీగా వివరాలను సేకరించి వారిని 3 టీంలుగ విభజించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రేవంత్ సూచించారు. సంక్రాంతి పండుగ నాటికి నూతన సర్పంచులతో ఒక భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. పార్టీల వారీగా వచ్చిన ఓట్ల శాతాన్ని మండల, నియోజకవర్గ స్థాయిల్లో విశ్లేషించి పార్టీ భవిష్యత్ వ్యూహాలను రూపొందించాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. నదీ జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుస రించిన విధానాల వల్ల రాష్ట్రానికి ఎంత నష్టం జరిగింది, ప్రాజెక్టుల డీపీఆర్ లు వెనక్కి వచ్చిన సందర్భాలలో అసెంబ్లీ సమావేశాల్లో గళంవిప్పి రాష్ట్ర ప్రజలకు గట్టిగా వినిపించాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. ఏపీ ప్రభుత్వం అనుమతి లేకుండా చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆధారాలతో సహ వివరించనున్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం తాగునీటి ప్రాజెక్టుగా పరిమితం చేసి, రైతులకు చేసిన అన్యాయాన్ని ఎండగట్టాలని మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు 90 టీఎంసీల పూర్తిస్థాయి ప్రాజెక్టుగా మార్చడానికి తీసుకుంటున్న చర్యలను అసెంబ్లీ సాక్షిగా ప్రజల ముందుంచాలని నిర్ణయించారు

# కేటీఆర్, హరీష్‌లకు నోటీసులంటూ ప్రచారం





**హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకు చేరుకుంది. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వంలోని కీలక నేతలకు సిట్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల అనంతరం ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగినట్లు కీలక నిందితుడు ప్రభాకర్ రావు పేర్కొన్నట్లు సమాచారం. సిట్ అధికారులు రివ్యూటీ కమిటీలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మరోసారి విచారించారు. సాధారణ పరిపాలన శాఖ మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావును కూడా విచారించిన అధికారులు, అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ నంబర్ల మంజూరు, అందుకు అనుమతులపై ప్రశ్నించారు. మాజీ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఐపీఎస్ అధికారి నవీన్ చంద్రకు సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది.ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు పలు ఆసక్తికర విషయాలను గుర్తించారు. ఒక ప్రముఖ టీవీ ఛానల్ ఎండీతో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు ట్యాపింగ్ చేయించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే, మరికొంతమంది ప్రముఖులపై నిఘా ఉంచేందుకు మాజీ మంత్రి కేటీఆర్ ఈ ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, పౌర సమాజ ప్రతినిధులు, సొంత పార్టీ నేతలపై కూడా నిఘా పెట్టారనే కోణంలో దర్యాప్తు సంస్థ లోతుగా విచారణ జరుపుతోంది.ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు అరెస్టై బెయిల్ మీద విడుదలయ్యారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు విదేశాల్లో ఉండటంతో ఆయనను రప్పించేందుకు ప్రభుత్వం 'రెడ్ కార్నర్' నోటీసులు జారీ చేయడంతో ఆయన భారత్ కు వచ్చి విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారేందుకు కొందరు అధికారులు సిద్ధమైనట్లు ఇటీవల ప్రచారం జరిగింది. దీంతో గత ప్రభుత్వంలోని రాజకీయ పెద్దలకు ఈ కేసుతో ఉన్న సంబంధంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు సైతం ఈ కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది.

## ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ఆగ్రహం

**ఖమ్మం :** అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు.ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు.తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. డిసెంబర్ 31 వరకే ఛాన్స్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలకు మొత్తం 9,79,506 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ఇప్పటి వరకు పరీక్ష ఫీజులు చెల్లించినట్లు పేర్కొంది. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటికే వరకు ఫీజు చెల్లించకపోతే.. అటువంటి వారికి మరో అవకాశం ఇస్తూ బోర్డు తాజాగా కీలక ప్రకటన జారీ చేసింది. రూ.2 వేల ఆలస్య రుసుంతో డిసెంబరు 31వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.తాజా ప్రకటన మేరకు డిసెంబర్ 31వ తేదీ వరకు విద్యార్థులు ఆయా జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపల్‌లకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. కాగా ఈ ఏడాది అక్టోబరులో పరీక్షల ఫీజు షెడ్యూల్ ప్రకటించగా.. ఇందులో ఇచ్చిన వివరాల ప్రకారం ఆలస్య రుసుం గడువు డిసెంబరు 15వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో ఈ నెలాఖరు వరకు పరీక్ష ఫీజు చెల్లింపులకు అవకాశం కల్పించారు. ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 17వ తేదీ వరకు జరగనుండగా.. ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18వ తేదీ నిర్వహించనున్నారుఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ చీఎం స్కేల్ ఎ 2025 మెయిన్స్ పరీక్ష మరో ఐదు రోజుల్లో జరగనుంది. ఈ క్రమంలో ఆర్ఆర్‌బీ అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. డిసెంబర్ 28న జరగనున్న మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ రిజిస్ట్రేషన్ లేదా రోల్ నంబర్, పాస్‌వర్డ్ లేదా పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నోటిఫికేషన్ కింద రూరల్ బ్యాంకుల్లో మొత్తం 13,217 పోస్టులను భర్తీ చేయనున్న సంగతి తెలిసిందే. ఇందులో 3, 907 స్కేల్ ఎ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు ఉన్నాయి. మెయిన్స్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూకి పిలుస్తారు.

## కరీంనగర్ పోలీసులకు సైబర్ నేరాలు, డిజిటల్ చెల్లింపులపై ఆర్బీఐ అవగాహన సదస్సు

**ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**


**కరీంనగర్ :** నకిలీ నోట్ల గుర్తింపు, డిజిటల్ అరెస్ట్ వంటి అంశాలపై పోలీసులకు శిక్షణ.రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్బీఐ, ఆధ్వర్యంలో మంగళవారంనాడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర హాలు నందు ఈ–బిఏటి ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్నెస్ మరియు ట్రైనింగ్, కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు మరియు నకిలీ నోట్ల గుర్తింపుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లు అవలంబిస్తున్న కొత్త కొత్త పద్ధతుల పట్ల పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే బాధితులకు త్వరితగతిన న్యాయం చేయగలమని సూచించారు.ఈ సదస్సులో క్రింది అంశాలపై కూలంకషంగా వివరించారు.?సైబర్ మోసాలు: ఇటీవల సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్ట్, లాటరీ స్కామ్‌లు మరియు అనుమానాస్పద లింక్‌ల ద్వారా జరుగుతున్న నేరాలు.సురక్షిత లావాదేవీలు: యూపీఐ, ఎన్ఇఎఫ్ టి,ఆర్ టి జిఎస్ మరియు ఎల్ ఎంపిఎస్ వంటి సేవలను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ముఖ్యంగా యూపీఐ పిన్ భద్రత గురించి వివరించారు.?నకిలీ నోట్ల గుర్తింపు: అసలు నోట్లకు, నకిలీ నోట్లకు ఫేక్ కరెన్సీ, మధ్య ఉండే తేడాలను ఎలా గుర్తించాలి మరియు నోట్ రీఫండ్ నియమాల గురించి అవగాహన కల్పించారు.?ఫిర్యాదుల విధానం: డిజిటల్ లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు లేదా మోసపోయినప్పుడు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, ఆర్బీఐ అంబుడ్స్‌మన్ సేవలను ఎలా పొందాలి అనే విషయాలను వివరించారు.?నగదు రహిత లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలు మరియు సైబర్ భద్రతా చిట్కాలను పోలీసు సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు.?ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్, వెంకటరమణ, ఆర్బీఐ అధికారులు, ఆర్బీఐ ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ మేనేజర్ సత్యజిత్ ఘోష్, మేనేజర్ ఖాదర్ హుస్సేన్, వెంకటరమణ, కమిషనరేటుకు చెందిన ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ :** కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంరోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి, గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి, గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. పాఠశాల బస్సులపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ అతికించాలని సూచించారు. జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. తిమ్మాపూర్ లోని సారథి ట్రాఫిక్ అవగాహన పార్కును విద్యార్థులు సందర్శించేలా చూడాలని తెలిపారు. విభిన్న కార్యక్రమాల ద్వారా రోడ్డు అవగాహన మాస ఉత్సవాలు ఏర్పాటు చేయాలని అన్నారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గురించి వివరించారు. గత సంవత్సరం కాలంలో ప్రమాదాలు, మరణించిన వారి సంఖ్య తదితర వివరాలు వెల్లడించారు. కరీంనగర్–జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉన్నందున రాత్రి వేళల్లో దారి కనిపించక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంభవిత అధికారులు ఈ మార్గంలో వాహనదారులకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు






# ఇంట్రెస్టింగ్ పోస్టర్‌తో ఆసక్తి రేపుతున్న రవి బాబు..

## ఈ సారి ఏ కాన్సెప్ట్‌తో వస్తున్నాడో..!

క్రియేటివ్ డైరెక్టర్ రవిబాబు మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచే ప్రకటన చేశారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగు తొండం ఘటికాచలం' సినిమా థియేటర్లకు కాకుండా నేరుగా ఈటీవీ విన్ ఓటీటీలో విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఇప్పుడు రవిబాబు తన కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేస్తూ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. తాజాగా ఈ కొత్త సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ పోస్టర్ చూడగానే ఇది సాధారణ సినిమాకాదు, పూర్తిగా భిన్నమైన కథతో రూపొందుతున్న సినిమా అనే ఫీలింగ్ కలుగుతోంది. వింతగా, మిస్టీరియస్‌గా ఉన్న పోస్టర్ సినిమా క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉండబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. రవిబాబు స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సినిమా కూడా కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనుందనే అంచనాలు మొదలయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను రేపు ఉదయం 10:30 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సినిమా టైటిల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను ఒకేసారి బయటపెట్టనున్నారు. దీంతో రవిబాబు అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ఈ అప్డేట్ కోసం ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌ను ఫ్లయింగ్ ఫ్రాగ్స్ సంస్థ, సురేష్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ రెండు ప్రతిష్టాత్మక బ్యానర్లు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం సినిమాపై మరింత నమ్మకాన్ని పెంచుతోంది. కంటెంట్‌కు పెద్దపీట వేసే ఈ బ్యానర్ల నుంచి ఒక నాణ్యమైన సినిమా రాబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు డిఫరెంట్ కాన్సెప్ట్స్, వినూత్న కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రవిబాబు, ఈసారి కూడా అదే స్థాయిలో ఒక కొత్త క్రైమ్ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారని తెలుస్తోంది. రేపు రాబోయే అధికారిక ప్రకటనతో ఈ సినిమాపై ఉన్న ఉత్కంఠ మరింత పెరగడం ఖాయం.

# క్రిస్టోఫర్ నోలన్ 'విజువల్ మ్యాజిక్'.. గూస్ బంప్స్ తెప్పిస్తున్న 'ది ఒడిస్సీ' ట్రైలర్!

'ఓపెన్‌హైమర్'తో ఆస్కార్‌ను కొల్లగొట్టిన గ్లోబల్ లెజెండరీ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ తన తదుపరి విజువల్ వండర్ 'ది ఒడిస్సీ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. గ్రీకు పురాణాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హోమర్ రాసిన పురాతన గ్రీకు మహాకావ్యం 'ది ఒడిస్సీ' ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ట్రోజన్ యుద్ధం ముగిసిన తర్వాత 'ఒడిస్సియస్' తన స్వస్థలమైన ఇథాకాకు చేరుకోవడానికి పదేళ్లపాటు సముద్రంలో ఎదుర్కొన్న సాహసోపేతమైన ప్రయాణం, గ్రీకు దేవతలు, రాక్షసులతో చేసిన పోరాటాన్ని నోలన్ తన స్టైల్‌లో చూపించబోతున్నారు. ఇందులో ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటిస్తుండగా, ఇతర ప్రధాన పాత్రల్లో టామ్ హాలండ్ (కుమారుడు టెలిమాకస్‌గా), యాన్ హాత్వే (భార్య పెనెలోప్ గా) కనిపిస్తున్నారు. ఇంకా జెండయా, రాబర్ట్ ప్యాటిన్సన్ వంటి స్టార్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు.




# సంక్రాంతి బరిలో శర్వానంద్.. 'నారీ నారీ నడుమ మురారి' టీజర్ రిలీజ్




టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారీ నారీ నడుమ మురారి'. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. టీజర్ ప్రారంభమే చాలా ఆసక్తికరంగా ఉంది. శర్వానంద్ హీరోయిన్ సాక్షి వైద్యను ప్రేమించి, పెళ్లికి సిద్ధమవుతాడు. అంతా సవ్యంగా సాగుతోంది అనుకున్న తరుణంలో.. అతని ఆఫీస్‌లోకి కొత్త టీమ్ లీడర్‌గా సంయుక్త మీనన్ ఎంట్రీ ఇస్తుంది. అయితే ఆమె మరెవరో కాదు, హీరోకి ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్. అయితే తన పెళ్లి ఆగిపోకుండా ఉండటానికి హీరో పడే పాట్లు, ఇద్దరమ్మాయిల మధ్య చిక్కుకుని అతను పడే ఇబ్బందులు నవ్వులు పూయిస్తున్నాయి. శర్వానంద్ కామెడీ టైమింగ్, ముఖ్యంగా సత్య మరియు సునీల్‌తో కలిసి చేసే హంగామా సినిమాపై అంచనాలను పెంచేసింది. ఏకే ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# దుల్కర్ సల్మాన్ సినిమాలో దసరా యాక్టర్.. ఇంతకీ రోల్ ఏంటో మరి?



మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులు, మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఈ స్టార్ యాక్టర్ రీసెంట్‌గా కొత్త తెలుగు సినిమాను ప్రకటించగా.. DQ41 (వర్కింగ్ టైటిల్)తో వస్తోంది. రవి నేలకుడిటి డైరెక్టర్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని వన్ ఆఫ్ ది టాలీవుడ్ లీడింగ్ బ్యానర్ ఎస్ఎల్‌వీ సినిమాస్ తెరకెక్కిస్తోంది. తాజాగా ఈ చిత్రంలో మరో టాలెంటెడ్ యాక్టర్ జాయిన్ అయ్యాడు. రీసెంట్‌గా ది గర్ల్ ఫ్రెండ్ మూవీతో మంచి సక్సెస్ అందుకున్నాడు కన్నడ యాక్టర్ దీక్షిత్‌శెట్టి. దీక్షిత్‌శెట్టి పుట్టినరోజు (డిసెంబర్ 22) సందర్భంగా మేకర్స్ DQ41 అనౌన్స్‌మెంట్ చేశారు. అయితే ఇందులో దీక్షిత్‌శెట్టి ఎలాంటిపాత్రలో కనిపిస్తాడనేది సస్పెన్స్‌లో పెట్టేశారు. ఈ చిత్రంలో పొడుగుకాళ్ల సుందరి పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇటీవలే ప్రకటించారు మేకర్స్. కాగా మేకర్స్ ఇప్పుడు మరో క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. బాహుబలి స్టార్ రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. బాహుబలి ఫ్రాంచైజీలో శివగామి లాంటి పవర్ ఫుల్ రోల్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది రమ్యకృష్ణ. ఇంతకీ రమ్యకృష్ణ ఈ ప్రాజెక్టులో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. DQ41 షూటింగ్ దశలో ఉంది.

# చిరు - బాబీ సినిమాపై క్రేజీ రూమర్స్.. 'మెగా 158'పై పెరుగుతున్న హైప్



మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా విడుదలకు రెడీ అవుతుండగా, వెంటనే దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సినిమాను 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్స్‌తో పిలుస్తుండగా, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరు - బాబీ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా సోషల్ మీడియాలో ఓ క్రేజీ న్యూస్ వైరల్ అవుతోంది. అదేంటంటే ఈ సినిమాలో మెగాస్టార్‌తో పాటు మరో స్టార్ హీరో కీలక పాత్రలో కనిపించబోతున్నారనే టాక్. ఇప్పటికే తమిళ స్టార్ హీరో కార్తీ పేరు వినిపించగా, ఆ తర్వాత మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ కూడా ఈ సినిమాలో భాగం అవుతారనే వార్తలు ఊపందుకున్నాయి. లేటెస్ట్ సమాచారం ప్రకారం, మోహన్‌లాల్ ఈ ప్రత్యేక పాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే చిరంజీవి %-% మోహన్‌లాల్ లాంటి ఇద్దరు దిగ్గజ నటులను ఒకే ఫ్రేమ్‌లో చూడటం అభిమానులకు నిజంగా పండుగే అవుతుంది. ఇక కథ విషయానికి వస్తే 'మెగా 158' లో చిరంజీవి తండ్రి పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆయన కూతురిగా ఓ యంగ్ అప్‌కమింగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ హీరోయిన్ ఎవరన్నదానిపై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది. అలాగే బాలీవుడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ అనురాగ్ కశ్యప్ కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. స్టార్ కాస్టింగ్‌తో పాటు టాప్ టెక్నీషియన్స్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారని సమాచారం. బాబీ ఈసారి తన రెగ్యులర్ టీమ్‌కు భిన్నంగా కొత్త టాలెంట్‌ను రంగంలోకి దించుతున్నారని తెలుస్తోంది. మాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ నిమిష్ రవి ఈ సినిమాకు డీఓపీగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే ఆయన 'కురుప్', 'కింగ్ ఆఫ్ కోతా', 'లక్కీ భాస్కర్', 'లోకా: చాప్టర్ 1' వంటి సినిమాలకు పని చేసి ప్రశంసలు అందుకున్నారు. మ్యూజిక్ విషయంలో కూడా రెగ్యులర్ కంపోజర్ కాకుండా, మెగాస్టార్ ఇమేజ్‌కు తగ్గట్టు కొత్త తరహా సౌండ్ ఇచ్చే సంగీత దర్శకుడిని ఎంపిక చేయనున్నారని టాక్. రస్టిక్ మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాను %ఖఎచీ% ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com